# నెల్లూరు శ్రీ యర్ర దర్గా స్వామి వారి
# దివ్య చరిత్ర
## (శ్రీ సయ్యద్ అహ్మద్ బాబా గారి దివ్య చరిత్ర)

సేకరణ: - శ్రీ షఫీ , నెల్లూరు
సంకలనం:- శ్రీ పెసల సుబ్బరామయ్యా
గొలగమూడి

ప్రథమ ముద్రణ 2007
కాపీలు 5000
సర్వ హక్కులు & ప్రచురణ:-

శ్రీ సాయి మాష్టర్ సేవా ట్రస్టు
గొలగమూడి
నెల్లూరు జిల్లా 524 321

వెల:- 5 Rs/-

ప్రతుల కొరకు వ్రాయండి:-

1. శ్రీ సాయి మాష్టర్ సేవా ట్రస్టు
గొలగమూడి
నెల్లూరు జిల్లా 524 321
2. బారాషహీద్ దర్గా దగ్గర
D K W కాలేజ్ ప్రక్కన,
A K నగర్, నెల్లూరు.

# గోప్యమైన దర్గా

నెల్లూరు DKW (దొడ్ల కౌశల్యమ్మ మహిళా కళాశాలకు దక్షిణంవైపున) వున్నది. ఈ దర్గాకు పడమర వైపు నెల్లూరు చెరువు వుంది. టౌన్ బస్సులో అయితే పోలీస్ ఆఫీస్ స్టాప్‌లో దిగి పడమర వైపు వెళ్లాలి. కొన్ని టౌన్ బస్సులు, పొదలకూరు రూట్ బస్సులు దర్గాముందు నుండే పోతాయి. టెంకాయలు, పూలు, ప్రసాదాలు అమ్మే అంగళ్లు కూడ దర్గా ముందు వున్నాయి.

నెల్లూరులో రొట్టెల పండగ అని సంవత్సరమునకు ఒక సారి మొహరం నెల 12వ రోజు చేస్తారు. భారతదేశం మొత్తం నుండి భక్తులొచ్చి దర్శిస్తారు. ఈ దర్గాను ఎర్రదర్గా అని కూడ పిలుస్తారు.



# పరిచయము

శ్రీ ఎర్రదర్గా స్వామి వారి శిష్యుడు రెడ్డితాతగారు ఇలా చెప్పారు. "నేను హిందువునై ఉండి ముస్లిం గురువునాశ్రయించడం బాగుండలేదని అందరూ నన్ను శ్రీ గొలగమూడి వెంకయ్యస్వామి దగ్గరకు వెళ్ళమని అనేక సార్లు చెప్పసాగారు. శ్రీ వెంకయ్య స్వామిని చూడాలని ఒకసారి మా గురువు గారైన సయ్యద్ అహమద్ బాబాగారికి చెప్పకుండా గొలగమూడి వచ్చాను. నేను శ్రీ వెంకయ్యస్వామిగారికి సాష్టాంగ పడి లేవగానే "అంతా ఒకటే గదయ్యా" అన్నారు. నీ గురువు, నేనూ ఒకటే ననే భావం తేల్చారు. నెల్లూరులో మా గురువుగారి దగ్గరకు వెళ్ళాను నేను ఏమీ చెప్పక ముందే "పోయి వచ్చావయ్యా" అన్నారు. నేను చెప్పకుండా వచ్చినా నేను గొలగమూడి వచ్చిన విషయం వారికి తెలిసింది. ఈవిధంగావారు తమ అభేదస్థితిని ఎరుక పరచారు.

వెంకయ్యస్వామివారు "అంతా ఒకటే గదయ్యా" అనడంతో శ్రీ సయ్యద్ అహమద్ బాబాగారికి తనకు భేదం లేదని చెపుతున్నారు గనుక ఈమహనీయుని చరిత్ర కొంతైన లోకమునకు తెలియజేయాలని నా తపన నేటికి ఫలించింది. శ్రీ షఫీ గారి వలన కొంతైన వెల్లడించగలిగారు.

శ్రీ బాబా గారితో అనుభవాలున్న భక్తులు తమ అనుభవాలు వ్రాసి సంతకం చేసి మీ పోష్టల్ అడ్రసు వ్రాసి నాఅడ్రసుకు పంప ప్రార్ధన. ఇలాంటిదే మరియొక గ్రంధం వెలువరించ గలను. శ్రమ అనుకోకుండా గొప్పదైన ఈధర్మ కార్యమునకు సహకరించ ప్రార్ధన.

శ్రీ సాయి మాస్టర్ సేవాట్రస్టు,
గొలగమూడి, నెల్లూరు జిల్లా,
524 321.



# ఎఱ్ఱ దర్గా స్వామి

ఈ మహనీయునికి తల్లి దండ్రులు పెట్టిన పేరు సయ్యద్ అహమద్. వీరి తండ్రి గారి పేరు కాలేషా, తల్లి పేరు రహమాన్బీ. సయ్యద్ అనగా సత్యసంధుడు అని అర్ధము. కాలేషా గారు నెల్లూరు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేసేవారు. సత్యసంధుడైన కాలేషా గారికి **S.P.** గారికి తగాదా వలన ఆ ఉద్యోగం పోయింది. తరువాత చిన్న కిరాణా కొట్టు పెట్టారు. ఎవరైన దొంగతనంగా అంగట్లోవస్తువు ఎత్తుకెళ్తుంటే ప్రక్కవారు చెప్పినా వారికేమి అవసరమో, ఎన్ని బాధలో అని, ఏమీ అనేవారు కాదు. అమాయకులైన ఆదంపతుల అంగడి ఈవిధంగా దివాల తీసింది. కాలేషా గారు తన భార్య, ఇద్దరు కుమారులు, కోడలు మరియు మనుమరాలును చాకవలసి వచ్చింది. బాబావారు పసివయస్సు కాబట్టి ఏమీ సంపాదించే వారు కాదు. వారి అన్న గారిది కూడ బాల్యదశ, ఆయన టైలరు. ఆయనకు భార్య కూతురు ఉండేవారు. బాబా గారి వదినగారు చాలా ఉత్తమురాలని బాబావారు అనేవారు. తల్లి గారు ఎండాకాలం వానాకాలం తెలియనంతటి అమాయకురాలు. తండ్రి గారు బోళా శంకరుడు. అందుచేత వారు సంపాదన లేక పస్తులుండేవారు. అనేక సందర్భాలలో మూడు రోజులపాటు వంట జరిగేది కాదు. అలాంటి కష్టకాలంలో కసుమూరు హజరత్ కాలేషా ఫీర్ కరిముల్లా షఖాదరిగారు వారిని ఆదరించినారు. ఏపూటకాపూట వారి జరుగు

బాటు చూస్తూ ఆకుటుంబాన్ని కాపాడారు. అందుకే సయ్యద్ అహమద్ బాబాగారు ప్రపంచములో ఎందరో మహనీయులు ఉన్నా కసుమూర్ మస్తాన్ వల్లీగారిని మాత్రమే "నాతండ్రిగారు" అనేవారు. ఆ మహనీయుడు వారిని కాపాడబట్టి వారి కొరవ జీవితం సుఖసంతోషంగా గడిచి దైవానికి చేరువయ్యారు. తండ్రి, అన్న, వదిన, అన్నకుమార్తె అందరూ క్రమంగా మరణించారు. తల్లిని పోషించే బాధ్యత కథానాయకుడైన సయ్యద్ అహమద్ బాబా గారి భుజ స్కంధములపై బడింది.

వీరు చిన్ననాటినుండి దైవధ్యానంలో లీనమై మౌనంగా ఉండేవారు. ఉదరపోషణార్థం బీడీలు చుట్టేపని చేసేవారు. కొందరు పిల్లలు బీడీలు చుట్టేపని నేర్చుకునేందుకు వీరి దగ్గర వుండేవారు. ఆ పిల్లలను ఉన్నతస్థితికి తీసుకరమ్మని నిత్యం దేవుని ప్రార్థించేవాడు. పిల్లలకు తనకూ ఆరోజుకు ఎంత అవసరమో అంత డబ్బుకు సరిపడే బీడీలు చుట్టేటట్లు చేయమని దేవుని ప్రార్థించి పని మొదలు పెట్టేవారు. సాయంత్రానికి ఖచ్చితంగా అంతకూలీ వచ్చేది. ఇలా కాలం దొర్లిపోతుండేది. ఒకరోజు పీర్ సూఫీ హాజీ హమిరుద్దీన్ చిష్టియా అనే మహనీయుడు (ఔలియా) పంజాబ్ నుండి నెల్లూరుకు బాబా గారిని వెతుక్కుంటూ ఆయన బీడీలు చుట్టే కంపెనీకి వచ్చారు. అప్పటికి బాబా వయస్సు పన్నెండు సంవత్సరములు. ఆ మహనీయుడు అహమద్ బాబా గారిని ముత్తుకూరు దగ్గర సముద్రతీరమునకు తీసుకవెళ్ళి తారక మంత్రోపదేశం చేసి, అల్లా ధ్యానం నేర్పించి, ఎవ్వరికి చెప్పని



గోప్యవిషయాలు చెప్పి "సయ్యద్ నువ్వెవరివో నాకు తెలుసు. నువ్వు నాకు గురువువి, నేను నీకు ఏమి బోధించగలను అని నీవు ఏడు తక్లీమ్‌లకు చక్రవర్తివవుతావు" అని చెప్పి వెళ్లాడు. ఆయన చెప్పినట్లే సృష్టికర్త అయినటువంటి అల్లా నన్ను **7+7 (14)** తక్లీమ్ లకు చక్రవర్తిని గావించినాడు అని సయ్యద్ బాబాగారు షఫీ, రెడ్డితాత గార్లతో ఒక సందర్భంలో తెలిపినారు. ఇలాంటి విషయాలు మనలాంటివారికి మహనీయులు తెలుపకపోతే ఎలా తెలుస్తుంది.

గురూపదేశమయ్యాక ఆయన నిత్యఉపాసిగాను, ఘోర తపస్విగాను మారాడు. అందరూ వీరికి పిచ్చి పట్టిందనుకున్నారు. వీరి తల్లి గారు ఇంటింటికి నీళ్ళు మోసి పావలా బేడా సంపాదించి ఆడబ్బుతో మంత్రగాళ్ళను ఆశ్రయించి తన బిడ్డ పిచ్చి నయం చేయమని అర్థించేది. ఆమెకు డబ్బుపోవడం తప్ప తనబిడ్డకు గల దైవప్రేమను ఎవరు మాన్పగలరు. ఇలా కొంతకాలం గడిచింది.

బాబా గారి అమ్మ గారు అంతిమదశలో మంచం పట్టినపుడు కంటికి రెప్పలా చూస్తూ పసిబిడ్డకు చేసినట్లు సేవచేసారు. తల్లిగారు స్వర్గస్తులైన తరువాత పది సంవత్సరములు బాబాగారు నెల్లూరులో కనపడలేదు. ఆ పది సంవత్సరములు కసుమూర్ మస్తాన్ వల్లీ గారి నీడలో, అడవులలో ఘోర తపస్సు గావించినారు. పూర్తిగా పండిపోయిన తరువాత సంకల్పసిద్ధులై అగ్రస్థానమునకు చేరి నెల్లూరు వేంచేసినారు. బొగ్గుతో గోడలమీద "అల్లా మహమ్మద్

సయ్యద్ అహమ్మద్" అని వ్రాసేవారు. ఆవ్రాసే కాలంలో జీడిగింజల రసాన్ని కళ్ళలో కాటుకలాగా పెట్టుకొనేవారు. వీరు మహనీయులని అందరూ అనుకొంటుంటే నమ్మలేని కొందరు దుండగులు వీరినొక రాత్రివేళ ఒక పాడుబడ్డ బావిలో పడేశారు. మహనీయుడైతే బ్రతికి బయటికి వస్తాడు లేకుంటే చనిపోతాడని తలచారు. కానీ బాబాగారు ఎలా వచ్చారోగాని తెల్లవారినుండి వారు వీధులలో తిరుగుతున్నారు. మరొక దుండగుడు వీరు మహనీయులైతే కాలదని వీరి కాలుపై యాసిడ్ పోశాడు. యాసిడ్ పడ్డచోట శ్రీస్వామివారికి కాలింది. గనుక వారు మహనీయులు కాదని ప్రచారం చేయసాగాడు. పై యిద్దరూ ఘోర మరణం పాలయ్యారు. మహమ్మద్ రసుల్లా మార్గంలో ఎంతటి శక్తి సంపన్నులైన మహనీయులైననూ సామాన్య మానవులవలె ప్రవర్తించవలెను కాబట్టి వారికి కాలినట్టు చూపించినారు. ద్రావకం పోసిన వ్యక్తి బాబాగారిని గూర్చి వ్యతిరేకంగా ప్రచారం చేసేవాడు. బాబాగారు సమాధి అయిన తర్వాత నుండి అతనికి మూత్రవ్యాధి వచ్చి పైపు ద్వారా మూత్ర విసర్జన గావిస్తూ దుర్వాసనతో పది సంవత్సరముల పాటు కృంగి కృశించి అతి భయంకరమైన బాధాకర జీవితాన్ని గడుపుతూ చనిపోయాడు.

## బాబాగారు ఎర్ర గుడ్డలు ధరించడం :

ఇద్దరు వ్యక్తులు నిమ్మకాయ నీళ్ళలో గ్రామ పోన్ పిన్నులు వేసి త్రాగమని ఇస్తే బాబాగారు త్రాగేశారు. వారి నోటి



వెంబడే రక్తంకారి గుడ్డల నిండా ఎర్రగా అయినది. తర్వాత నుండి బాబాగారు ఎర్రగుడ్డలు ధరించుతున్నారు. ఈ ఘాతుకానికి పాల్పడిన యిద్దరి వంశాలు అంతం అయి పోయినాయి.

బాబాగారు ఒకసారి బారాషయ్యద్ దర్గా బయట కూర్చుంటే ముగ్గురు నల్గురు వ్యక్తులు వచ్చి ఏమన్నా తిందాము రమ్మంటే బాబాగారు వారితో మీరు ఏమి తినాలనుకొంటున్నారు? అని అడిగారు. మాకు బిర్యాని తినాలని ఉంది అన్నారు. అప్పుడు ఈద్గా ప్రాంతంలో వున్న దుత్తలో బిర్యాని వుంది తినమన్నారు. వాళ్ళు అక్కడకు వెళ్ళి చూడగానే బిర్యాని కన్పించింది. వారిద్దరికి కడుపు నిండుగా సరిపోయినది. మంచి నీళ్ళ కోసం వారు చూడగానే బాబాగారు ఆ దుత్తలోనే ఉన్నాయి చూడమన్నారు. వారు చూడగానే దాంట్లో తేటతెల్లంగా మంచి నీరు వుంది. దాన్ని త్రాగి దప్పిక తీర్చుకున్నారు. బిస్మిల్లా అని చెప్పి ఏ పని ప్రారంబించిన అది విఘ్నం కాదు.

బాబా ఎప్పుడూ నా వయస్సు 18 సంవత్సరములు అనేవారు. పెద్దవాళ్ళు వచ్చినా నా వయస్సు 18 సం. అని చెప్పేవారు. బాబాగారి మాటలను బట్టి 18వ ఏటనే సిద్ధి పొంది ఔలియా స్థాయి చేరినట్లు తెలుస్తుంది.

తనకు నచ్చిన వారిని, బాధలలో వున్నవారినడిగి బరువుగల పది పైసలు తీసుకొనేవారు. ఇత్తడి పైసలు ఇస్తే అయిష్టంగా

తీసుకొనేవారు. అంతకుమించి ఎక్కువ డబ్బు యిచ్చినా తీసుకునే వారు కాదు. డబ్బులు కాగితాలు రూపేణయిస్తే అసలు ముట్టుకొనేవారు కాదు. తనకు ఆకలని ఎవ్వరిని చేయిచాపి అడిగేవారు కాదు. ఎవరైనా ఏదైనా పెడితే తినేవారు. టీ యిస్తే త్రాగి తృప్తి చెందేవారు. అలా వారు దైవత్వం నిండిన హృదయంతో తిరుగు తున్నప్పుడు వారికి కొందరు భక్తులు ఏర్పడ్డారు. వారు ఎవ్వరిళ్ళకు వెళ్ళేవారు కాదు. వారికి బుద్ధిపుట్టిన చోట పడుకొనేవారు. వారితో అవసరమున్నవారు వెదికి దర్శించే వారు. రెడ్డిగారు బాబా శిష్యులు అయిన తరువాత నెల్లూరులో బార్కాసు నందు ఖాదర్ ఔలియా నిషానులోనే ఆయన స్థిరనివాసం ఏర్పరచుకున్నారు. అప్పటి వరకు ఎలాంటి స్థిరనివాసం లేని తాతాగారికి చెక్క బల్ల యిచ్చి స్థిరనివాసం ఏర్పరచారు.

బాబాగారు నెల్లూరు బార్కాస్‌లో చెక్కలు పేర్చి వుంటే వాటి మీద పడుకొని వుండే వారు. అలా కొన్ని రోజులు గడిచిన తరువాత చెక్కలన్నింటిని తీసివేస్తే అక్కడ దాదాపు చాటెడు తేళ్లు వున్నాయి. ఈ చెక్కలు మీదే బాబాగారు మూడు సంవత్సరములు పడుకున్నారు. అపుడు ఎవరూ కూడ తిన్నావా లేదా అని అడిగే వారు కాదు. ఒకతను ఆ తేళ్ళన్నింటిని చంపి సయ్యద్ భాయి యిన్ని తేళ్ళు కుడుతుంటే ఎట్లా పడు కున్నా వయ్యా అని అడిగితే ఎందుకయ్యా వాటిని చంపినావు అట్లాంటి పనులు మనం చేయకూడదు అని బాబా చెప్పినారు.



నెల్లూరులో మద్రాస్ బస్టాండ్ దగ్గర వుండే సూర్య హోటల్ దగ్గర బాబాగారు వుండేవారు. అక్కడ ముగ్గురు అన్నదమ్ముళ్ళు మెకానిక్ పని చేస్తూన్నారు. అందులో ఖాజా మస్తాన్ అనే అతనువుండేవాడు. ఏదో వూరినుంచి ప్రతి నిత్యం సాయంకాలం ఐదు గంటలకు ఒక బస్సు రిపేరుతో వచ్చేది. ఒకసారి ఆ బస్సు రంగనాధ స్వామి దేవస్థానం ఎదురుగా వున్న రైలు పట్టాల మీద ఆగిపోయినది. ఆ బస్సుకు సెల్ఫ్, బ్యాటరీ లేదు. నెట్టడానికి మనుష్యులు కూడా లేరు. యజమానులు వచ్చి ఖాజీ మస్తాన్ అనే మెకానిక్‌ను తీసుకొని వెళ్ళినారు. ఖాజీ మస్తాన్ డ్రైవర్ సీటులో కూర్చొని బస్సును కదిలించుటకు ప్రయత్నము చేస్తున్నాడు. రైలుగేటు ఆయన రైలు వచ్చేస్తుంది త్వరగా బస్సును అడ్డం తీయమని రచ్చ చేస్తున్నాడు. అందరూ ఖాజీ మస్తాన్‌ను రైలు వచ్చేస్తుంది ముందు నీవు దిగి వచ్చేసెయ్ అని అరుస్తున్నారు. తన కళ్ళ ముందే బస్సు ముక్కలైపోతుందని తన ప్రాణంకూడా లెక్కచేయకుండా ప్రయత్నం చేస్తున్నాడు. ఒకప్పుడు ఇతనితో సయ్యద్ అహమద్ బాబాగారు ఒక విషయం చెప్పారట. ''ఎప్పుడైన అవసరం వస్తే పిలవవయ్యా వస్తాము''అని చెప్పిన విషయం గుర్తు వచ్చి ''సయ్యద్ సాబ్ మద్ధత్ కరోజీ ''(సయ్యద్ సాబ్ సాయం చేయి) అని అనుకోగానే అద్దంలో అతనికి బాబాగారు దర్శనమిచ్చారు. అతనికి తెలియకుండానే చెయ్యి సెల్ఫ్ బటన్ మీదకు పోయి ఒత్తడం బస్సు స్టార్ట్ అయ్యి ఇటురావడం రైలు అటుపోవడం రెప్పపాటులో జరిగిపోయినది. తర్వాత షెడ్ దగ్గరకు

వచ్చి సెల్ఫ్ మోటారు యిప్పి చూస్తే అది ఎన్నో రోజుల క్రితమే కాలి బూడిదై పోయి వుంది. బ్యాటరీ కన్నం అయింది. తర్వాత బాబాగారిని దర్శించినపుడు "ఏమి భయపడ్డావా?" అని అడిగారట. మీరుండగా భయమేముంది సయ్యద్ సాబ్ అంటూ వచ్చేశాడు. మహనీయులు కాపాడుతారన్న విశ్వాసం ఇతనిలో ధృడంగా వున్నది. ఇతనే ఈ విషయం స్వయంగా షఫీ గారికి చెప్పాడు.

బాబాగారి గురించి షఫీగారు ఇంకా ఇలా చెపుతున్నారు ...

బాబాగారు వుండే చోట ఒక దుష్ట శక్తి వుండేది. అందువల్ల అక్కడ ఎవరూ వుండేవారు కాదు. వారు కాలు మోపిన తర్వాత ఆ స్థలంలో దుష్టశక్తులు దూరమైనాయి. ఈ రోజు ఆ స్థలంలో సూర్యా హోటల్‌లాంటి ఎన్నోఅందమైన భవనాలు లేచాయి. ఒకనాడు ఈ ఖాజీ మస్తాన్ షెడ్ దగ్గర బాబాగారు కూర్చొని వున్నారు. అక్కడ ఐదారుగురు మనుష్యులు కూడా వున్నారు. ఉన్నట్లుండి "ఆయన వస్తున్నాడు లేవవయ్యా, కడప షేర్ వస్తున్నాడు" అని అక్కడ నుండి వెళ్లి పోయాడు. కాసేపట్లో కడప నుంచి పీరల్లా హుస్సేన్ వచ్చాడు. అక్కడున్న వారు ఆశ్చర్య పోయారు. తిరిగి బాబాగారు వచ్చినారు. కడప గురువుగారు బాబాగారి గురించి ఒకటవ స్థానంలో వున్నారు అని అన్నాడు. తాతాగారు వున్న కాలంలోనే స్టేట్ బ్యాంకులో పని చేసే భాషాగారి భార్యకు దుష్టగ్రహం ఆవహించి బాధ పెడుతూ వుండేది. వీళ్ళు



బాబా దగ్గరకు వచ్చిపుడు ఇక్కడ మూడు నిద్రలు చేయమన్నారు. వారిద్దరూ బాబా దగ్గర మట్టిలోనే నిద్రలు చేశారు. మూడవ నిద్రకు బాగు చేసి పంపించినారు. ఆ నమ్మకంతో బాబాదగ్గర ఏమైనా చేస్తాను అని చెప్పి మొదట కమిటీ పెట్టించాడు. తాతాగారి కోసం చిన్న రూము కట్టించి సమాధిని కట్టించారు. ఈ రోజు కూడా వీరికి ఏ లోటూ లేకుండా అల్లా సర్వమూ చూసుకొంటున్నారు.

ఒకనాడు అర్ధరాత్రి సమయమున బాబాగారి దర్శనం కోసం ఒక హైందవ భక్తుడు వచ్చాడు. అతను బాబా కోసం వెతికి చివరకు ఎవరో చెప్పగా బాబా వున్న చోటును తెలుసుకుని అక్కడకు వెళ్లాడు. అప్పుడు బాబాగారు ఒక ఖాళీ ప్రదేశంలో గడ్డి మీద పడుకొని వున్నారు. వారి ఒంటిపై తేళ్ళు ప్రాకుతున్నాయి. బాబాగారు వాటిని ఉద్దేశించి తినండి! బాగా తినండి! తృప్తి తీరా తినండి అని అంటున్నారు. ఆ దృశ్యాన్ని చూచేటప్పటికి ఆ భక్తుడికి ముచ్చెమటలు పోశాయి.

ఒకసారి బాబావద్దకు ఒకతను వచ్చాడు. అతనికి రెండు కళ్ళు బొత్తిగా కనపించడం లేదు. అతను బాబాను వేడుకున్నాడు. బాబా అతనిపై అనుగ్రహించి తన మంచం తలవైపు ఒక అగరబత్తిని వెలిగించి మంచం చుట్టూ మూడు సార్లు ప్రదక్షిణ చేసి వీలుంటే ఇటు చెరువు గట్టుదాకా లేకపోతే అటు సంతపేట మండపం దాకా ఎవరినైనా తోడు తీసుకొని పోయిరా. ఈ విధంగా ఐదు రోజులు చెయ్యి దేవుడు మేలు చేస్తే ఆ తరువాత చూద్దాం అని అన్నారు.

ఆ అంధుడు భక్తి శ్రద్ధలతో బాబాచెప్పినట్లు చేసాడు. బాబా ఆశీర్వాద ఫలంతో దేవుని అనుగ్రహంవల్ల నాల్గవ రోజుకే అతనికి చూపు బాగా వచ్చింది.

## బాబాగారి దివ్య వాణి

ఒకరోజు షఫీగారు బాబాగారిని ఏమైనా బోధించమని అడిగారు. ''సత్యం చెప్పు, ఐదు పూటలా నమాజుచెయ్యి, తల్లి దండ్రుల మాట ప్రకారం నడుచుకో అన్నారు.'' నా పద్దెనిమిదవ ఏట ఒకరోజు బాబాగారి సన్నిధిలో కూర్చొని వున్నాను. శ్రీ సయ్యద్ బాబాగారు నావైపు ప్రేమగా చూచి నీకు శత్రు వర్గముంది అది నీకు దూరమైపోతుందిపో అన్నారు. అది నా అంతః శత్రువులైన అరిషడ్వర్గములని వాటిని శ్రీ బాబాగారు ఆ విధంగా నాకు దూరం చేస్తున్నారని అప్పటిలో నాకు తెలియలేదు. నమాజుకు టైం అయ్యింది గనుక మసీదుకు వెళ్తానని వారిని అడిగాను. ఇటువంటి సమయాలు అనేకమార్లురావు అలా పోగొట్టుకుంటే ఎలా? సరే పోయిరాపో అన్నారు.

ఒకరోజు బాబాగారు బజారులో ఎదురుపడి నన్నేమైనా ఇవ్వమన్నారు. నా దగ్గర ఏమీ లేక పది పైసలుంటే ఇచ్చాను. దాన్ని తీసుకుని ''దానం చేస్తే ఎవ్వరికీ చెప్పబాకు కుడిచేత్తో దానం చేస్తే ఎడమ చేతికి తెలియకూడదు'' అన్నారు.



ఒకరోజు శ్రీ బాబాగారిని వారి శక్తి రహస్యం చెప్పమని అడిగాను. అదే సమయంలో వచ్చిన రెడ్డితాతాగారు ''నీకు దారి కావాలంటే మొదట ఖానా, సోనా, భజానా మానాలి. తిండి, నిద్ర, స్త్రీ సుఖము మానాలి. ఆ స్థాయికి నీవు రాగలిగితే నీకు మార్గం దొరుకుతుంది''అని రెడ్డితాతాగారి ద్వారా పలికారు. కాలం గడిచే కొద్దీ ఒకనాడు బాబాగారు ''నీటి రంగు ఏమిటో తెలుసునా'' అని అడిగారు. నాకేమి తెలుసుబాబా అన్నప్పుడు ''నీళ్ళ రంగు నలుపు భూమి రంగు నలుపు నల్లనేలలో పండింది తినకూడదు నల్లనీరు త్రాగకూడదు అన్నారు. అంటే అన్నము, నీటిని తగ్గిస్తూవస్తే తపస్సు సిద్ధిస్తుంది అని చెపుతున్నారు.

ఒక రోజు శ్రీఅహమద్ బాబాగారు చెప్పారు. ''ఒక ముసల్మాన్ కానివాడు ఇస్లాంను తెలుసుకోవాలంటే ఒక ముసల్మాన్ కంటే తొమ్మిది రెట్లు ఈమాన్ (దైవ విశ్వాసం) ఎక్కువ వుండాలి. ముసల్మాన్ అనగా సద్గుణ సంపన్నుడు, షరియత్ తూ.చ తప్పక ఆచరించేవాడు, అబద్ధం చెప్పనివాడు, ఎవ్వరిని కనుచూపుతో కూడా బాధించనివాడు, సద్గుణాలు ఇమిడి పోయినవాడుగా వుండాలి. ఒకసారి రెడ్డితాతగారితో ''తాతా ఆహారం ఉదయం, తీసుకోవాలికదా మిగిలిన సమయాలలో విపరీతమైన ఆకలి వేస్తే ఆ క్షుద్బాదని ఎలా నిగ్రహించుకోవాలి అని షఫీగారు అడిగారు. తాతగారు ఏదో చెప్పబోయే సమయంలో బాబాగారు బయటకు వచ్చి సపోటాలమ్మేవాడున్నాడు పిలవమని చెప్పాడు. అతని దగ్గర బాబాగారు పది పైసలకు ఒక చిన్న సపోటా కొని అందులో మొదట

సగం తిని మరలా అయిష్టంగా మిగిలిన సపోటా కూడ తిని ఒక షోడా త్రాగి పడుకున్నారు. శ్రీ రెడ్డితాతగారు పై విషయాన్ని షఫీకి చెపుతూ ''భరించలేని ఆకలైతే సగం సపోటా లేదా ఒక్క సపోటా మాత్రం తిని నీళ్ళు త్రాగి ధ్యానంలో వుండాలి. దీన్ని బాబాగారు ఇలా వుండాలని  నీకు తెలుపడానికే చేశారు. ఇది జీవితాంతం నిలిచిపోయే సత్యం'' అని చెప్పారు.

ఒక్కొక్కప్పుడు మాలోని చెడు సంస్కారాలు తొలగించేందుకు నిష్కారణంగా మమ్ములను తిట్టరాని తిట్లు తిట్టేవారు. ఒక వారం రోజులలో మాలో కలిగిన మార్పు తెలిసేది. నేనుగాని తాతగారుగాని చెడుతలంపులు వచ్చినపుడు వెంటనే వారికి దూరంగా వెళ్లిపోయేవాళ్ళము. సైతాను ప్రభావం వలన చెడ్డకోరికలు, నిగ్రహించుకోలేని చెడు తలంపులు వచ్చినప్పుడు ''అవుజు బిల్లాహీ మినష్ సైతాన్ నిజ్జిజీమ్'' ఈ మంత్రం పఠించితే సైతాన్ ప్రభావం తొలగిపోతుంది అన్నారు.

## సయ్యద్ బాబాగారి దివ్య వాక్కు

నమాజు వల్ల ఎక్కువ మంది మహారుషులయ్యారు. నమాజు చేయకుండా చాల కొద్దిమంది మహనీయులైనారు. అందువలన షరియత్ అనేది ప్రతిమనిషికి అవసరం. వ్యభిచారం చేసినా, హత్యచేసినా దేవుడు క్షమిస్తాడు కాని సమాధులకు మ్రొక్కితే క్షమించడు అని నా సొంత(షఫీ) తెలివితో అనేవాడిని. కాని ఈనాడు



సయ్యద్ బాబాగారి దయవల్ల, శ్రీ కసుమూరు మస్తానయ్యా దయవల్ల సమాధులకు మ్రొక్కి ఎంత గొప్ప మేలు పొందవచ్చునో తెలుసుకొని గతంలోని నా మూర్ఖపు మాటలు క్షమించమంటాడు షఫీ గారు.

కసుమూరు మస్తానయ్యా మాత్రమే కాక నాగూరయ్యా, తాజుద్దీన్ బాబాగారు, అజ్మీరాయన కూడా అమేషా సయ్యద్ బాబాగారి దర్శనార్థం వచ్చేవారు. అలాంటప్పుడు బాబాగారు తాతగారిని ఎక్కడికీ పోనీయకుండా వుండమనేవారు. ఆ మహనీయులు పోయేటప్పుడు తాతగారికి దువా (ఆశీర్వాదం) చేయమని చెప్పేవారు. తాతగారు తప్పు చేస్తే ఏమి చేస్తాం తాత నీవు శాపగ్రస్తుడవి అనేవారు నాయనగారు. నీవు ఏమి పాపం చేశావు అని షఫీ గారడిగితే నేను ఏదో జన్మలో ఎవరో మహనీయునికి బాధ కల్గించి వుంటాను. అందువల్లనే నాయన అలా అన్నారు అని తాత చెప్పేవాడు.

ఒకసారి తాతగారు బాగా ఆకలిగా వున్నారు. కడుపులో తాటాకు మంట పెట్టినట్లుంది. అదేసమయంమలో నాయనగారి దగ్గరకు ఒక భక్తుడు ఒక రకమైన తీపి మిఠాయి తెచ్చాడు. నాయనగారు ఎటూ తినరు గనుక తాతగారు దాన్ని తినేశారు. వెంటనే నాయనగారు మంచంమీద నుండి లేచి అబ్బా ఎంత తప్పు చేశావయ్యా చేసినదంతా పోయిందికదా! అని అరిచారు. ఎంత తిన్నా కొంతకాలం వరకు మనస్సు దైవ ధ్యానానికి ఉన్ముఖం

కాలేదు. కొందరి మనస్సు మనపై పడగానే ఇలాంటి ఊహకందని ప్రభావాలు కలుగుతుంటాయి. అలాంటప్పుడు గురువుగారిని ప్రార్ధించు కోవాలి. రెండవరోజు అదే టైంలో వచ్చి మరలా ఆ పదార్ధం తెచ్చి తినమన్నారు. అప్పుడు తాతగారు నీవెవరివో నాకు తెలుసు నేను తిననుపో అని తరిమేశారు. సాధకులు సాధన ప్రారంభ దశలో ఇలాంటి ఇబ్బందులు జాగ్రత్తగా ఎదుర్కోవలసి వుంటుంది.

మురీద్ అంటే గురుపరంపరలో వచ్చే శిష్యుడనుకొని నా పని పిల్లవాడ్ని మురీద్ అని పిలిచాను. ఆనాడు నాయనగారు నాపైకి చాలా కోపంతో దూకి ''మురీద్ అంటే ఎవరనుకున్నావ్ చచ్చి బ్రతికినవాడే మురీద్. మూడు రోజులు ఏడ్చిన తరువాత నీవు మురీదు వౌతావులే నా ముఖాన్ని చూస్తూ కూర్చో అన్నీ జరిగిపోతాయి''అన్నారు. రూప ధ్యానం చేయమని ఆదేశిస్తున్నారు.

ఒకరోజు నాయనగారి దగ్గర కూర్చొని నేను ఈ జన్మలోనే మహాత్ముడనైపోవాలి అని అనుకొనుచున్నాను. వెంటనే నాయనగారు నావైపు చూచి ఏమి కావాలని సైగతో అడిగారు. నేను నోటితో అడగకుండానే అందరిలాగా వృధాగా చనిపోకూడదని మనస్సులో అనుకున్నాను. వెంటనే నాయనగారు నీవు వృధా కావులే మంచివాడవవుతావు ఉత్తమోత్తముడివి అవుతావులే అని పెద్దగా దీవించారు.



## నాయనగారి అమృతవాక్కు

కర్మకాలి ముక్కలైపోయి నాశనమైనవాళ్ళను దగ్గరకు తీస్తే అల్లా కూడ మెచ్చుకుంటారయ్యా అని ఒకరోజన్నారు. ఈ విషయం నాకు సరిగ్గా సరిపోయింది. అనేక పరిస్థితులవలన నేను ఏడు సార్లు చనిపోవలసింది. కానీ కేవలం నాయనగారి దయవల్ల బ్రతికాను. నా జీవిత కాలమంతా వారికి సేవ చేసినా నేనింకా వారికి బాకీ పడివుంటాను.

యర్రదర్గాస్వామివారిని చాలాకాలం సేవించిన షఫీగారిని తపస్సంటే ఏమి చేస్తారని అడిగితే ఇలా చెప్పారు. గురువుగారు వచ్చినవాళ్ళనందరిని తన దగ్గర వుంచుకోరు. వాళ్ళ అర్హత, ఋణాను బంధాలను బట్టి ఉంచుకుంటారు. అలా వుంచుకున్న వారికి తపస్సుకు తర్ఫీదు యిస్తారు. తపస్సంటే మా మార్గంలో నిద్రా హారములు జయించడం. మొదటిరోజులలో ఉదయం రెండు మూడు ఇడ్లీలు సాయంత్రం రెండుమూడు ఇడ్లీలు మాత్రమే ఆహారంగా ఇస్తారు. రాత్రి మూడు గంటలనుండి ఐదు గంటలు వరకు మాత్రమే నిద్ర పోవాలి. మధ్యలో నిద్ర తూగుతుంటే తనతోపాటు అట్లా తిప్పుతారు. ఇందులో ఆరూడుడైతే ఎంతో ఆనందం అనుభవిస్తారు. ఆ తర్వాత స్థితి ఆహారం ద్రవంగా తీసుకొంటూ కొద్దినిమిషాలు మాత్రమే నిద్రపోవడం ఇంకా ఆరూడ స్థితికివస్తే బొత్తిగా ఆహారం లేకుండా నిద్ర లేకుండా వుండే స్థితికి వస్తారు.

పెసల సుబ్బరామయ్య అను నేను చూచిన మహిమ:

ఈ దర్గా మెయిన్ గేటు రెండువైపులా రెండు వెండి కన్నులు బిగించియున్నారు. ఒక భక్తునికి కళ్ళు కనిపించక చాలా డబ్బులు ఖర్చు పెట్టినాడు. అప్పుడు బాబాగారికి నాకు కళ్ళు వస్తే వెండి కన్నులు సమర్పిస్తానని మ్రొక్కు కున్నాడు. తిరిగి కంటి చూపు రాగానే వెండి కన్నులు సమర్పించుకున్నాడని అక్కడ ముజావర్లు చెప్పారు.

నాయనగారు ఒకరోజు మాటల సందర్భములో నాతో( షఫీ), ఇలా అన్నారు ఆస్ట్రేలియా, మలేషియా, ఇండోనేషియా నుండేకాక ఆఫ్రికా నుండి కూడా ఇక్కడకు వస్తారు. అంటే అన్నిచోట్ల నుండి ప్రజలు ఇక్కడికి వచ్చి వారి బాధలు తీర్చుకొని వెళతారు. మానవులే కాదు దేవతలు కూడా వస్తారు. వీరేకాదు బేతాళుడువంటి వారుకూడా వస్తారు అని చెప్పారు. బేతాళుడు నాయన దర్శనానికి రావడం రెడ్డి తాతగారు స్వయంగా చూశారట.

ఒకనాడు షఫీగారు బాబాదగ్గర కూర్చున్నప్పుడు బాబాగారు యిట్లా అన్నారు. మహమ్మద్ రసుల్లావారు వస్తారు. నన్ను ఒడిలో ఎత్తుకుంటారు. ఏమి కావాలని అడుగుతారు నేను ఏమి కోరుకుంటానో తెలుసా నా ముందర వున్నవారిని క్షమించమని అడుగుతాను. ఆయన క్షమిస్తానులే అని అన్నారు. దీనికి అర్థం ఎవరైతే దర్గా దగ్గరకు దెయ్యాలు, అనారోగ్యం, యింటి సమస్యలు మొదలగు బాధలతో వస్తారో వారి బాధలు తీరిపోతాయి. పెద్ద పెద్ద



మహనీయులందరూ మహమ్మద్ రసులుల్లా వారి దివ్య దర్శనానికి తపించి పోయేవారు. అలాంటిది సయ్యద్ అహమ్మద్ బాబాగారిని అడగకనే తన ఒడిలోకి ఎత్తుకున్నారంటే బాబాగారి స్థాయి ఏపాటిదో అర్థం చేసుకోగలరు.

మనం తపస్సు చేస్తుంటే అందరు దేవతలు వచ్చి పరీక్షలు పెడతారు. ఆ పరీక్షలన్ని నెగ్గుకొన్నప్పుడే మహాత్ముడయ్యేది. కాలు జారితే మధ్యలోనే పడిపోతాము. ఎందుకు వాళ్ళు అలా పరీక్షలు పెడతారు, విఘ్నాలు తెస్తారు అంటే ఆరు వేల కోట్ల సంవత్సరాలు ఇంద్రుడు తపస్సు చేసి మూడు లోకాలకు అధిపతి అయ్యాడు. ఈ మానవుడు వంద సంవత్సరములు తపస్సు చేస్తే ఇంద్రుడిపైన అధిపతి అవుతాడు. అలా అవ్వాలంటే వీడిలో వుండే దోషాలన్ని తుడుచుకొని పోవాలి. అంటే వాళ్ళు పెట్టే పరీక్షలన్ని తట్టుకొని నెగ్గుకు రావాలి.

ఒకసారి నేను, తాతగారు వున్నప్పుడు నాయన తాతగారితో తాతా ఈ జన్మ వృధా చేసుకొంటే కొన్ని కోట్ల సంవత్సరములు ఏడ్చవలసి వస్తుంది అని మూడు సార్లు చెప్పారు. అదే మాటల్ని నాకు ఉర్దూలో మూడు సార్లు చెప్పారు. నాకు ఎప్పుడూ నాయన చెప్పిన మాటలే మనస్సులో దొర్లుతుండేవి. పై మాటలు నాయన చెప్పిన తరువాత ఒక రోజు మిద్దెపై కూర్చొని బేలుదారిచేత పనిచేయిస్తూ ఆలోచిస్తున్నాను. అదేంటి చాలా తప్పుగదా! భగవంతుడు వందసంవత్సరములు ఆయుష్షు యిచ్చి ఈ వంద

సంవత్సరములలోపు మానవుడికి ఆశ మొదలగు రకరకాల వికారాలు పెట్టి పొరపాటున తప్పుచేస్తే కోట్ల సంవత్సరములు వెనక్కి వేసేస్తున్నాడే అల్లా చాలా అన్యాయం చేస్తున్నాడే వందకి వంద సంవత్సరములే శిక్ష వేయాలి కాని కోట్ల సంవత్సరాలు వేయడమేమిటి? అనుకొని మర్చిపోయాను. మూడవరోజు యిక్కడ దర్గాల దగ్గరకు వచ్చాను. సమాధిలోనుండి మైకు మాట్లాడినట్లుగా శబ్దం వినిపిస్తుంది. ఒరేయ్! ఆరు వేల కోట్ల సంవత్సరములు తపస్సు చేసి ఇంద్రాధికారం పొందిన ఇంద్రునిపై కేవలం మానవుడు వంద సంవత్సరములు తపస్సు చేయడం వలన ఇంద్రుడుపై అధికారి అవుతున్నాడు. అది చేయకపోతే కోట్ల సంవత్సరములు బాధలను అనుభవించడంలో తప్పులేదు అన్నారు. ఈ మాటలు స్పష్టంగా నాకు సమాధినుండి వినిపించాయి. ఇలా ఎన్నోవిషయాలు స్పష్టంగా శబ్దంతో సమాధానం చెప్పేవారు.

## షఫీ గారు చెప్పిన అనుభవం

అప్పట్లో నా వద్ద 16 సంవత్సరముల పిల్లవాడు కూలిపని చేస్తుండేవాడు. అతడు గొలగమూడి వాస్తవ్యుడు ఒకసారి అతనికి కడుపులో నొప్పి వచ్చింది. రామచంద్రారెడ్డి ఆస్పత్రికి తీసుకు వెళితే ఇది 24 గంటల కడుపునొప్పి వెంటనే ఆపరేషన్ చేయాలని చెప్పారు. అతను బలహీనంగా ఉన్నందువల్ల ఆపరేషన్ చేస్తే బ్రతుకుతాడో లేదో తెలియదు. ఆ సమయంలో అతని తల్లి



దండ్రులు కూడ ఇక్కడ లేరు. ఆపరేషన్ చేయించే స్తోమత నాకు లేనందున వెంటనే సైకిల్ మీద ఎక్కించుకొని పెద్దాసుపత్రికి పోదామని వెళుతున్నాను. అలా వెళ్తూ ఏంచేయాలా అని ఆలోచిస్తుండగా వెంటనే సయ్యద్ బాబాగారి (ఎర్ర దర్గా స్వామి) వద్దకు తీసుకు వెళదామని తోచింది. నొప్పికి అమ్మా, అమ్మా అని పెద్దగా కేకలు పెడుతున్న అతను ఎర్ర దర్గా స్వామి సమీపానికి వెళ్ళగానే అరుపులు తగ్గాయి. స్వామి ఏంటి అని అడుగుతూ అతని చేతిని తాకారు.

నేను "నాయన! ఈ అబ్బాయికి 24 గంటలు కడుపు నొప్పి, ఆపరేషన్ చేయించాలట అన్నాను. అపుడు నాయన చేతులెత్తి "హే అల్లా ఇతనికి బాగవ్వాలి హాయిగా నిద్ర పట్టాలి" అని ప్రార్థించాడు. అతని అరుపులు చాల వరకు తగ్గి పోయాయి. నేను అతనిని తిరిగి సైకిల్ మీద మా యింటికి తీసుకొచ్చి మంచం మీద పడుకోబెట్టాను. నేను దేవుడు రూములో చాప వేసుకొని పడుకున్నాను. రోజంతా కష్టం చేసుండడంతో గాఢంగా నిద్ర పట్టేసింది. నేను ఉదయాన్నే 5గంటలకు లేసి 7గంటల వరకు నమాజు చేసుకొంటుంటే ఆ పిల్లవాడు నావద్ద కొచ్చాడు. ఎలా వుందని అడిగితే అతను నాకు ఒళ్ళు తెలియకుండా హాయిగా నిద్ర పట్టింది అన్నాడు. ఏరా ఇంటికి పోతావా అంటే ఇంటికెందుకు పనికి వస్తానని ఆరోజంతా పని చేశాడు. ఈవిధంగా ఎర్ర దర్గా స్వామి అతని బాధను క్షణంలో పోగొట్టారు.

## శ్రీ శ్రీ సయ్యద్ అహమద్ బాబాగారి మహత్యాలు.

పెద్ద బజారులోనే మార్కెట్ సమీపంలో వున్న పులి చావడి చౌక్కా మకాన్ అనే స్థలం వున్నది. ఆ పులి బొమ్మవద్ద ఒక పెద్ద వేప చెట్టు ఉండేది. ప్రస్తుతం అక్కడ పులి బొమ్మ లేదు వేపచెట్టు, మసీదు నిర్మించ బడివుంది. దానికి 'మర్కస్ మజీద్' అని పేరు పెట్టబడి వుంది. అక్కడ ఒక మీనార్ (గోపురం) నిర్మించబడి వుంది. ఒకనాడు ఆ పులి చావడి అరుగు మీద చెట్టు చాటున బాబాగారు నిద్ర పోతున్నారు. రాత్రి సుమారు ఒంటి గంట ప్రాంతంలో నిర్మానుష్యంగా వున్న ఆ నిశీధ సమయంలో ఒకతను ఇంటికి పోతున్నాడు. ఆచెట్టు వద్ద పెట్రోమాక్సు లైటు కాంతి కనిపించింది. ఈచెట్టు వద్ద ఈలైటును ఎందుకు పెట్టారబ్బా అనుకుంటూ చెట్టును సమీపించాడు. అతను చెట్టు దగ్గరకు వెళ్ళగానే లైట్ కాంతి మాయమై పోయింది. అతను దిగ్భ్రాంతి చెంది అక్కడ పడుకోనున్న వ్యక్తిని చూసి ఓహో సయ్యద్ సాహేబ్ గారా! అని అనుకొని ఇంటికి వెళ్ళిపోయాడు. మరు రోజు అతను ఆ విషయాన్ని నలుగురితో చెప్పాడు.

ఒకరోజొక చిత్రమైన ఆత్మబోధచేసి ఇతరులకు చెప్పవద్దని చెప్పారు. బాబాగారికి ప్రచారం అంటే పనికి రాదు. తనను గుర్తించి తన వద్దకు వచ్చిన వారి సమస్యల పరిష్కారమునకు తన శాయ శక్తులా సహాయపడేవారు. "దువా" చేసేవారు. దానికి ప్రతిఫలం ఆశించే వారు కాదు. ఎవరైన సంతోషంగా కానుక రూపంలో డబ్బు



ఇవ్వబోయినా తీసుకునే వారు కాదు. ఈవిషయం అచ్చం శ్రీ వెంకయ్య స్వామి వారు పెసల సుబ్బరామయ్యను "ఎట్లంటే అట్లా మాట్లాడతావేమి" అని తన దివ్యాత్వాన్ని గురించి ఇతరులకు చెప్పకుండా చేసినట్లుంది. అందుకే కాబోలు శ్రీ స్వామి వారు అంతా ఒకటే గదయ్యో అని శ్రీ బాబాగారి శిష్యునితో అంటారు.

## షఫీ గారు ఇలా చెప్పారు:

పెన్నా నది కట్ట మీద వున్న పాత పెద్ద హాస్పటిల్ దగ్గర ఒక పేదరాలు నివశించేది. ఈమె కొడుకు పేరు మస్తాన్ , వెల్డింగ్ పని చేసేవారు. ఒకసారి వారి ఇంట్లో చేపల కూర వండు తున్నారు. ఆసమయంలో బాబాగారు వారింటికి వచ్చి ఒక చన్ పాడారు. పాడిన తరువాత పాడినవాడు సరైన వాడైతే ఆ శబ్దానికి ఆ ఉడికే వలికి తట్టలు (చేప పేరు ) బ్రతకాలి అన్నారు. ఆ మాటతో ఉడికే పాత్రలో చేపలు తిరుగుతూ కన్పడ్డాయి. ఈ విషయం అందరికి చెపితే వారికి కూరలాగే కన్పిస్తుంది. భక్తి గల వారికి తప్ప అందరికి చూపితే మహత్యం నశిస్తుంది. మహాత్ములు లోకానికి వెల్లడి కారు.

1968 సంవత్సరం ప్రాంతంలో వడగళ్ళ వాన కురిసింది. అప్పుడు బాబాగారు ఒక సన్నిహితుడితో కలిసి ఒక రూములో ఉన్నారు. ఆ రూము అతి పురాతనమైనది. బయట ఉరుములు మెరుపులతో హోరున గాలి వాన పడుతున్నది. ఈ గాలి వానకు ఈ రూము ఎక్కడ విరగబడుతుందోనని ఆ సన్నిహితుడికి భయం వేసి

ఆవిషయం బాబాతో చెప్పారు. బాబాగారు రూము బయటకు వచ్చి ఆకాశం వైపు చూచి తల ఆడించి నవ్వుకుంటూ 'ఏం పరవాలేదు భయపడకు ఇక రాదు ఆగి పోతుంది' అని అంటూ తిరిగి రూములోకి వచ్చేశారు. వారు రూములోకి వచ్చిన రెండు నిమిషాలకల్లా వున్నట్లుండి తగ్గి పోయినది.

ఒకనాడు బాబాగారు పడుకున్న రూములోనే వారి సన్నిహితులు ఒకరు పడుకున్నారు. బాగా ప్రొద్దు పోయిన తరువాత ఎవరో తలుపు తోసినట్లు అనిపిస్తే ఆ సన్నిహితుడు కళ్ళు తెరచి చూచాడు. ఏదో ఆకారం లోపలికి వచ్చి బాబాకు ప్రణామం చేసి తిరిగి వెళ్ళి పోయింది. ఏమిటీ విచిత్రం? ఎవరిదీ ఆకారం? అని ఆ సన్నిహితుడు అనుకుంటూ ఉండగా బాబాగారు ఆ సన్నిహతుడిని పిలచి, లేచి పోయి తలుపుకు గడియ పెట్టు లేక పోతే ఎవరెవరో లోపలికి వచ్చేస్తుంటారు, కాసేపు గూడ శాంతిగా వుండనివ్వరు అని అన్నారు. అప్పుడా సన్నిహితుడు ఆ వచ్చిన ఆకారం ఏదో అదృశ్యశక్తి అయి వుంటుందనుకొని లేచి వెళ్ళి తలుపుకు గడియ బిగించాడు. బాబాగారికి సామాన్యులే కాక స్థితి పరులు గూడ సన్నిహితులు ఉన్నారు. ఒకనాడు బాబాగారు అటువంటి స్థితి పరుడైన సన్నిహితునితోపాటు మరి కొంతమందితో కలిసి కూర్చొని ఏదో దేవునిపై చర్చ జరుపుతున్నారు. అప్పుడు సమయం సాయంత్రం నమాజ్ వేళ అయి వుంటుంది. బాబాగారు వున్నట్లుండి చర్చను ఆపివేసి ఆ స్థితి పరుడైన సన్నిహితుని పిలచి అగరబత్తి వెలిగించమన్నాడు. అతను అగరబత్తి వెలిగించాడు.



అగరబత్తి కాలుతూ వుంటే బాబాగారు ఆ పొగను చూస్తూ 'మనిషి శరీరములోనుంచి ప్రాణవాయువు గూడ ఇదే విధంగా గదా గాలిలో కలిసి ఎగిరి పోతుంది' అని అన్నారు. వెంటనే ఆ స్థితిపరుడైన సన్నిహితుడు అవునని అన్నాడు. బాబాగారు అతని సమాధానానికి నెమ్మదిగా నవ్వుతూ అలా ఇప్పుడు ఎవరైన ఎగిరి పోయి వుంటే వారికి నీవు తప్పకుండా సహాయం చేయాలి అని అన్నారు. ఆ మాటతో ఆ స్థితి పరుడు కాస్త తికమక పడి ప్రక్కనున్న మరో సన్నిహితుడితో బాబాగారి మాటలలోని ఆంతర్యమేమిటని అడిగాడు. బాబాగారి మాటలో ఎంతో అర్థమున్నదని నీకు సంభందించిన వారి చావు కబురు వింటావని వారికి నీవు సహాయం చేయాలని నీ దగ్గర సహాయం ఆర్థించే వారు నీ దగ్గర పని చేసే వారే అయి వుంటారని కాబట్టి అలాంటి వార్త నీవు వింటే వారికి కాదనుకుండా సహాయం చేయాలని బాబాగారి మాటకు అర్థం అని సన్నిహితుడు వివరించాడు. ఆ మాటల సందర్భంలో ఆ స్థితి పరుడు వద్ద పని చేసే ఒకతను హడావుడిగా వచ్చి 'అయ్యా మా తండ్రి చనిపోయినాడు, నా జీతంలో నుంచి వంద రూపాయలు ఇప్పించండి' అని ప్రాధేయ పడ్డాడు. ఆ రోజుల్లో వంద రూపాయలంటే ఈ రోజుల్లో వెయ్యి రూపాయలతో సమానం. క్షణాల మీద జరిగిన ఈ సంఘటనకు అందరూ నివ్వెర పోయారు. వెంటనే ఆ స్థితి పరుడు అతనికి చీటి వ్రాసిచ్చి యిది తీసుకెళ్ళి గుమస్తా దగ్గర యిచ్చి డబ్బు తీసుకుపో అని అన్నారు.

<u>వెంకట రెడ్డి, శెట్టి గుంట రోడ్డు, నెల్లూరు వారు ఇలా చెబుతున్నారు.</u>

నేను బింగినపల్లిలో జన్మించాను. 18వ సంవత్సరములో నాకు వివాహమయినది. అప్పటికే ఒక శక్తి నన్ను వెంటాడుతుంది. అప్పట్లో ఆశక్తి ఏంటని తెలుసుకోవాలనే ఆలోచనే లేదు. 1983లో ఒక బంకు పెట్టుకున్నాను. రోజుకు రెండు మూడు వందల ఆదాయం వచ్చేది. డబ్బంటే లెక్కలేదు. డబ్బు వల్ల దుర్వ్యసనాల పాలయ్యాను. డబ్బున్నందు వల్ల లారీ కొన్నాను. కొన్న మూడు నెలలు తరువాత లారీ కాలి పోయింది. 1984 మే నెల కల్లా చేతిలో టీ త్రాగటానికి కూడ డబ్బులేదు.

ఒకరోజు ఇన్సూరెన్సుకు అర్జీ ఇచ్చేందుకు లాయర్ను కలిసి నవాబుపేట నుండి ఇంటికి వెళుతున్నాను. ఒక టీ అంగడి దగ్గర ఒక నవాబు పరిచయం అయ్యాడు. ఆయన పేరు పెట్టి పిలిచి ఒక టీ కూడ ఆర్డర్ చేశారు. నా దగ్గర టీకు కూడ డబ్బులు లేవు నా పేరు తెలుసా అంటే నాకు తెలుసులే అన్నాడు. నువ్వు ఎర్ర దర్గాకు పో అన్నాడు. నేను ఇంటికి పోకుండా ఇద్దరం కలిసి బారా షహీద్ దర్గాలో గల సయ్యద్ బాబా దర్గా దగ్గరికొచ్చాము. అక్కడ ఎర్ర గుడ్డలాయన ఉన్నాడు. ఆయన దగ్గర సుందర రామిరెడ్డి అనే హిందువు ఆత్మ విద్య కోసం ఆయనను సేవిస్తున్నాడు. ఈ రెడ్డి గారిని అందరూ హేళన చేస్తుండే వారు. ఆ రోజు దర్గాల దగ్గర చదివింపులు ఎవరికి వుంటే వాళ్ళు అక్కడ భోజనం చేసి నిద్ర చేస్తారు. ఆ రోజున స్వప్నంలో నల్లగా పెద్ద ఆకారంగా ఒక శక్తి



కనపడి నన్ను పిలిచి లారీ కాలకుండా ఉన్నట్లైతే నువ్వు కాలి పోయేవాడివి అన్నది. అప్పటి నుండి ఆ దర్గాల దగ్గర ఏదో శక్తి వుంది, ఇక్కడేదో బాగుపడవచ్చని ఈ దర్గాలకు రావటం ఇక్కడ నుండి గొలగమూడి, కసుమూరు, తిరుపతికి వెళ్ళటం జరుగుతుంది.

బాబాగారు ఏ క్షణంలో ఏం జరగబోతుందో చెప్పేవారు. వారి సన్నిహితులకు ఏదైన ఆపదో, నష్టమో తదితర సామాజిక బాధలు రాబోయే పరిస్థితులు వుంటే వారిని వెంటనే హెచ్చరించేవారు. వాటికి తరుణోపాయం గూడా చెప్పేవారు. బాబా మాటను విశ్వసించి వారిని నమ్మి చెప్పినట్లు అనుసరించినవారు అటువంటి బాధలు కష్టాల్లో నుంచి తట్టుకొనేవారు. లేనివారు వాటిని అనుభవించేవారు.

ఒకనాడు ఒక సన్నిహితుడు తనవద్ద పనిచేసే హిందువుని తోడుబెట్టుకొని బాబావద్దకు వచ్చి ఇతను చాలా కాలంగా బాధపడుతన్నాడు, కాస్త అనుగ్రహించి ఆశీర్వదించండి అని అన్నాడు. ఆ హైందవుడు బాబాకు ప్రణామం చేసి తన భార్యకు ఐదేళ్ళ నుంచి ఎర్రబట్ట అవుతున్నదని ఎన్ని మందులు తిన్నా, ఎక్కడెక్కడ తిరిగినా నయం కాలేదని విన్నవించుకున్నాడు. బాబాగారు అతనికి ఆశీర్వాదం యిచ్చి ఐదు రోజులు తర్వాత మళ్ళీ కనిపించి ఎలాఉన్నదో చెప్పు అని అన్నారు. అతను ఐదు రోజులు తరువాత మరలా బాబా వద్దకు వచ్చి అమితానందభరితుడై

బాబాకు ప్రణామం చేసి, నాలుగు రోజులకే జబ్బు పూర్తిగా నయమైపోయిందని చెప్పి తన జేబులోనుంచి నోట్లను తీసి బాబాకు యివ్వబోయాడు. అతని ప్రవర్తనపై బాబాకు ఆరోజు అమితమైన కోపం వచ్చింది. అతన్ని వెంటనే తన ముందునుంచి వెళ్ళిపో అని గద్దించారు. బాబాకోపాన్ని చూసి అతను బిత్తరపోయాడు. ఆ సమయంలో అక్కడున్న బాబాగారి సన్నిహితులు బాబాను శాంతింపజేశారు. ఐదేళ్ళుగా తాను భరిస్తున్న బాధను, ఖర్చును బాబాగారు ఐదురోజుల్లో తీర్చేశారు. ఆ ఆనందంలో బాబాను సంతోషపెట్టాలనే సదుద్దేశంతో డబ్బు ఇవ్వబోయానని అతను బ్రతిమిలాడుకున్నాడు. బాబా శాంతపడిన తర్వాత కనీసం ఏదైన తెచ్చి పెడతాను నా తృప్తి కోసం తినండి బాబా అని అర్థించాడు. సన్నిహితులు బాబాగారికి నచ్చజెప్పగా బాబాగారు సరే! వెళ్ళి ఒక వడ అందులో కొంచెం కారం వేసుకొని ఒక టీ తీసుకొనిరా అని అన్నారు. అతను అవి తీసుకరావడానికి వెళ్ళాడు వెళ్ళినవాడు మూడు రోజులు రాలేదు. మూడువనాడు భార్య పిల్లలతో నేతిలో కాల్చిన వడలు మూట, చిన్న డబ్బాలో కారంపొడి తీసుకొని వచ్చాడు. వాళ్ళను చూసి బాబాగారు ఏమిటివి అని అడిగారు. మీరు వడ కారం తీసుకొని రమ్మన్నారు గదా అవి తీసుకొచ్చాడు అని బాబా సన్నిహితులు చెప్పారు. బాబాగారు నేను తీసురమ్మన్నది ఒక్క వడేగా ఇన్నెందుకు అన్నారు. ఏదో మీకు కడుపు నిండా తినిపించి నేను తృప్తిపడాలనుకున్నాను బాబా అని అతను వినయ విధేయలతో అన్నాడు. బాబాగారు తన



సన్నిహితులలో ఒకరిని పిలిచి ఆ వడలను తీసి సమానంగా అందరికి పంచిపెట్టమన్నారు. ఆ సన్నిహితుడు అక్కడున్న వారందరికీ, అతని భార్య పిల్లలతోసహా తలా రెండేసి వడలు యిచ్చి బాబాకు రెండు యిచ్చి తనకూ రెండు ఆ తట్టలో పెట్టుకున్నాడు. బాబాగారు పంచిన సన్నిహితుడిని పిలచి అందరికీ సమానంగా పంచావా? అని అడిగారు. అతను పంచానన్నాడు. మరి నీవు వుంచుకున్నావా? అని అడిగారు. వుంచుకున్నాని అన్నాడు. సరిగా చూచి చెప్పు నీకు వున్నాయా? వున్నాయండి అన్నాడు. బాబాగారు అక్కడున్న వారందరినీ ఆ తట్టలో వున్నాయో లేదో చూడమన్నారు. చూస్తే ఆ తట్ట ఖాళీగా వుంది. ఆ వింతను చూచి అందరూ దిగ్భ్రమ చెందారు. బాబాగారు తనకు యిచ్చిన రెండు వడలలో నుంచి ఒక వడ తీసి ఆ పంచినతనికిచ్చి ఆ మిగిలిన ఒకటి తాను తిన్నారు. అంటే బాబాగారికి తాను కోరిన ప్రకారం ఒక్కటే చెందినది.

ఒకనాడు బాబాగారు కాళ్ళవద్ద నుంచి తల వరకు ముసుగు కప్పుకొని విశ్రాంతి తీసుకుంటున్నారు. వారి సన్నిహితుడు ఒకతను వారి ప్రక్కన కూర్చుని వున్నాడు. బాబాగారు ముసుగులోనుండే 'నీ పీర్ (మత గురువు) వస్తున్నారు అని ఆ ప్రక్కనున్న వ్యక్తితో అన్నారు. అతను నలువైపులా చూచి, బాబా సమయా సందర్భం లేకుండా పీర్ ఎందుకు వస్తారు? నీకు పిచ్చి ఎక్కువైపోయింది, మాట్లాడకుండా పడుకో'అని అన్నాడు. ఈ మాటలు ముగిసే లోపల బాబా చెప్పినట్లు ఆ మత గురువు అక్కడికి రానే వచ్చారు.

ఆ గురువుకి బాబాగారు ముసుగులో నుంచే సలాం చేశారు. ఆ ప్రక్కనున్న వ్యక్తి బాబాగారి దివ్య దృష్టికి ఆశ్చర్య చకితుడయ్యాడు. ఆ తరువాత బాబా గురించి తన గురువును అడిగాడు. బాబా ఒక మహా వ్యక్తి కాబోతున్నాడని ఆ గురువు శెలవిచ్చారు.

## శ్రీ ఎఱ్ఱ దర్గా స్వామివారి లీలలు

ముజావర్ భాషా అను భక్తునకు తరచూ కండ్లు మూసుకున్నపుడల్లా శ్రీ ఎఱ్ఱ దర్గా స్వామి దర్గా కనబడుతుండేది. అందువల్ల వారు శ్రీ దర్గా స్వామివారి దర్గాను పది సంవత్సరముల నుండి దర్శిస్తుండేవారు. మూడు నెలల క్రితం వీరి నోటికి పక్షవాతం వచ్చినది. అన్నము కూడ తినలేక పోయేవాడు. పక్షవాత స్పెషలిష్టు బొమ్మాకేశవులు వారి వద్ద చికిత్సకని వెళ్ళితే మూడు నెలలు కటిక పత్యం వుండాలని నెల రోజులు వేడినీళ్ళు మాత్రమే త్రాగాలని చెప్పి మందుఇచ్చారు. వీరు ఆర్తితో శ్రీ దర్గా స్వామి వారిని 'స్వామి నేను ఆరోగ్యంగా ఉంటేనే కదా మీ సేవ చేసుకోగలిగేది, అనారోగ్యంతో మీ సేవ ఎట్లా చేసుకోగలను' అని కన్నీటితో ప్రార్థించుకొనేవారు. చిత్రాతి చిత్రంగా పదిహేను రోజులలోనే వారి పక్షవాతం నయమై అన్నము కూడ తినగలుగు చున్నారు.



శ్రీ స్వామివారు కలలో వీరికి చేతబడి చేసి పక్షవాతం వచ్చేట్లు చేసిన వ్యక్తిని చూపారు. అతనికికూడ స్వామి సేవ చేసుకోవాలని ఉండి భాషాగారిని తొలగిస్తేనే కానీ తనకాసేవ లభించదనే దుర్బుద్ధితో అలా చేసాడని భావిస్తున్నారు. కానీ వీరు ఆర్తితో ప్రార్థించినందుకు దర్గాస్వామివారు ప్రసన్నులై ధర్మబద్ధంగా వున్న వీరి వ్యాధి నయంచేసి తన సేవలోనే వుంచుకున్నారు. వీరికి అప్పుడప్పుడు శ్రీ దర్గాస్వామివారు స్వప్న దర్శనం కూడ ప్రసాదిస్తుంటారు.

భాషా తండ్రి గారికి గుండె జబ్బు వస్తే ఆ రోజుల్లో పెద్ద పెద్ద డాక్టర్లు వద్దకు పోతే ఇక్కడ అలవికాదు అమెరికన్ ఆసుపత్రికి పోవాలి అన్నారు. అప్పట్లో అంత డబ్బు లేదు. ఎవరో తిరుపతిలో మంచి డాక్టర్ వున్నారు వారి వద్దకు వెళ్ళమన్నారు. భాషా నాన్నగారు శ్రీ స్వామివారి దగ్గరకు పోయి అడిగారు. భాషాగారు మాత్రం ఏమీ అడగక మనస్సులో మా నాన్నగారికి ఇట్లా వుంది స్వామి అని అనుకున్నారు. శ్రీ స్వామివారు మీ నాయనకు గుండె జబ్బు వచ్చింది కదా! పోతుందిలే ఆసుపత్రికి పోనక్కరలేదు. కసుమూరు పోయి రెండు రాత్రులు నిద్రచేసి తీర్థం త్రాగి రమ్మాన్నారు. ఇంక మళ్ళీ చనిపోయేవరకు ఆ జబ్బు లేదు.

భాషాభాయిఅను భక్తుని పెద్ద కుమార్తెకు ఉబ్బసం వ్యాధి వుండేది కొద్ది దూరం నడిచినా పది నిమిషాలు కూర్చొని మరలా ఎవరో ఒకరి సహాయం ఉంటేనే నడచి రాగలదు. డాక్టర్లు గుండెలో

రెండు వాల్వులు పూడిపోయాయి. వాటికి ఆపరేషన్ చేస్తేకానీ నయంకాదని చెప్పారు. అటువంటి పరిస్థితులలో శ్రీ ఎజ్ఞ దర్గా స్వామిని గూర్చి ఆమె తండ్రి చెప్పగా వెళ్ళినది. కేవలం తండ్రిగారి మాటకు కట్టుబడి దర్గా స్వామి సమాధి వద్ద నిద్ర చేసి ఆర్తితో ప్రార్థించు కున్నది. చిత్రాతి చిత్రంగా అంత పెద్ద జబ్బు నయమైనది. ఇప్పుడు చక్కగా పెళ్ళి అయ్యి ఇద్దరు పిల్లలు కూడ వున్నారు. ఎందరికో దయ్యాల పీడ నుండి కూడ విముక్తి లభిస్తుండటం వారు ప్రత్యక్షంగా చూచారు. కనుక మనం మొండి పట్టుగా కూర్చొంటే ఎంత పెద్ద సమస్యనైన అవలీలగా తీరుస్తారు.

ఒకరికి గాలి జబ్బు లాంటిది వచ్చి ఎందరో భూత వైద్యులకు ఎన్నో ఆసుపత్రులకు చూపించారు. కానీ ఏ మాత్రం ఫలితం కనబడలేదు. శ్రీ ఎజ్ఞ దర్గా స్వామిని గూర్చి ఎవరో చెప్పగా విని సమాధి వద్ద రెండు మూడు నెలలు నిద్ర చేశారు. దానితో వారి బాధ పూర్తిగా తొలగి పోయినది. అందుకు కృతజ్ఞతగా వారు తరచూ వస్తూంటారు.

ఒకసారి సత్యనారాయణ టెక్స్‌టైల్స్ గారి పెద్ద కుమారునికి మూడు గడ్డలు లేచాయి. ఆపరేషన్ చేస్తే చచ్చి పోతాడని అంటున్నారు. వీరి శ్రీమతిగారు దీపారాధన చేసి దర్గా స్వామివారికి, స్వామి! మావాడికి నయమైతే నిలువు దోపిడి ఇస్తానని మ్రొక్కుకున్నది. వారికి నయమైన తరువాత మొక్కు చెల్లించడం మరచి పోయారు. దాంతో నిదానంగా ఆస్తి అంతా పోయినది.



హబీ బున్నిసా, కొడవల రాజుపాళెం, రాములవారి దేవాలయం వెనుక ఇల్లు, తన అనుభవాన్ని ఈ విధంగా చెప్పుతున్నారు:

ఈమె చిన్నప్పటి నుండి తరచూ దర్గాలను దర్శిస్తూ ఉండేది. ఇక్కడ ప్రతి సంవత్సరము రొట్టెల పండుగ తిరునాళ్ళులాగ చేస్తారు. అప్పుడు వచ్చి దర్గా స్వామిని దర్శనం చేసుకొనేది. వారు సమాధి అయిన తరువాత ఎప్పుడైన వచ్చి దండం పెట్టుకొని వెళ్ళిపోయేది. ఒకసారి ఆమె వంటి మీదకు దయ్యం వచ్చి తిరగలేక మంచానపడింది. శవం లాగ పడి వుంటూ భయంకరంగా కేకలు పెడుతూ వుండేది. ఆమె భర్త ఆమెను దర్గాల దగ్గర వదిలేసి పట్టించుకోకుండా వెళ్ళిపోయాడు. ఆమెకు మాత్రం ఇంటి దగ్గరకు నలుగురూ పరామర్శించడానికి వస్తారు గదా అందుకని పోతున్నానని చెప్పేవాడు. ఆమె అది నిజమేననుకున్నది. స్వామి దగ్గర నలభై రోజులకల్లా బాగై పోయినది. యింటికి పోదామని అనుకున్నది. శ్రీ స్వామివారు కలలో 'నా సంచులతో దండం పెట్టుకొని బస్సు ఎక్కినట్లు చూపారు' అది శ్రీ స్వామివారు ఇంటికి పొమ్మని చెప్పుతున్నారని ఒక పెద్దాయన చెప్పారు. యింటికి వెళ్ళిన రెండు నెలలకు మళ్ళీ ఆ దయ్యం ఆమె వంటి మీదకొచ్చి బాధించసాగెను. స్వామి దగ్గరకెళితే బాగుంటుందని చెప్పి మరలా బస్సు ఎక్కించాడు. స్వామి దగ్గరకు వెళ్ళిన రెండు మూడు రోజులకే తగ్గినది. ఒకసారి కలలో ప్రక్కనున్న దర్గాలో ఒక మగమనిషి ఇద్దరు ఆడ మనుషులు ఫోటోలు తీసారు. ఫోటోలు

రూపంలో నీకు ఇబ్బంది కలిగిస్తున్నారని ఒక సాహెబ్ చెప్పారు. ఒకావిడకు గాలి వచ్చి నీ మొగుడే నీ మీద కసి పెట్టుకొని చంపాలని చూస్తున్నాడు. అందువల్ల యిలా తగ్గటం మరలా రావటం జరుగుతుంది. ఒకసారి ఆమె భర్త నేనన్న వుండాలి లేదా కొడుకన్నా వుండాలి. వాడికి నాకు పడటం లేదు అన్నాడు. ఈమె పిల్లవాడు కావాలని చెప్పేసరికే భర్త వదలి వెళ్ళి పోయాడు.

పిల్లవాడికి ఒంట్లో జ్వరంగా వుంది. ఒక నెలనుండి ఆ పిల్లవాడి కలలో పోలీసుల్లాగా దొంగల్లాగా ఎవరో చంపటానికి తరుముతున్నట్లు, ఇంతలో యిద్దరు గడ్డమున్నవాళ్ళు స్వాముల్లాగా వచ్చి మా అబ్బాయిని మీరెవరు కొట్టటానికీ, చంపటానికీ మేమొప్పుకోము అని చెప్పారు. తరువాత డాక్టర్ దగ్గరకు పోతే టైఫాయిడ్జ్వరమని మందులు యిచ్చారు. రెండు రోజుల్లో జ్వరం తగ్గి పోయినది. అప్పుడు ఆమెకు చలి చలిగా వున్నది. డాక్టరుకు చూపించి ఇంజక్షన్ చేయించుకొని, రెండు మాత్రలు తీసుకొని బస్సెక్కి దర్గాల దగ్గరకు వచ్చిన తరువాత గిర గిర తిరిగి పడి పోయినది. నెల రోజులు కూడ పైకి లేవ లేకపోయెను. నెల నాటికి శ్రీ స్వామివారు బాగు చేసినారు. ఈ రోజుకి కూడ ఏ డాక్టరుకు చూపించము. ఐదు సంవత్సరముల నుండి స్వామి దగ్గరే తీర్థ ప్రసాదములు తీసుకొంటూ వుంటారు.



## వెంకట రెడ్డి గారి అనుభవాలు

స్నేహితులవల్ల పాన్‌పరాక్, గుట్కాలు తినటం ప్రారంభమైనది. రోజుకు ఇరవై దాకా తింటున్నాను. నోరు వాసన కొట్టి పన్ను రంధ్రం పడింది. నొప్పికి తట్టుకోలేక ఇంట్లోనే పడుకున్నాను. రెడ్డితాత కర్ర తీసుకొని వచ్చి తట్టి ఎందుకయ్యా అంత బాధపడతావు హాస్పటిల్‌లో పన్ను పుచ్చిపోయినపుడు ఇచ్చే నీళ్ళు పుక్కిలించి వూసి అలా రవ్వంత సేపు దర్గాల దగ్గర పడుకొని వస్తే పోతుంది అన్నారు. సైకిలుపై దర్గాల దగ్గరకు వచ్చి తీర్థం తీసుకొని పుక్కిలించి వూసి మరలా తీర్థం తీసుకున్నాను. ఇలాంటి మహాత్ములను నమ్మినపుడు ఒక పెద్ద యాక్సిడెంటు కూడ చీమ కుట్టినంత మాత్రం బాధతో విడిపోతాయని ఈయన నమ్మకం.

నా రెండవ కుమారునికి (12సం.) రక్త విరోచనాలై నేను గూడూరు నుండి వచ్చేటప్పటికే మంచమంతా రక్తం దారాలు దారాలుగా అల్లుక పోయినట్లుంది. ఉడక బెట్టిన సేమ్యాలాగా పిల్లవాడు చుట్టుకు పోయాడు. ఆ బాధ తట్టుకోలేక ఏడుస్తున్నాడు. చుట్టు ప్రక్కల వాళ్ళు బ్రతకడని చెప్పారు. ముందు ఆ పిల్లవాడిని కడిగి శుభ్రం చేయమని నా భార్యకు చెప్పాను. ముందర పిల్లవాడిని దర్గాకి తీసుకువెళితే తగ్గి పోతుంది అని నేనంటుంటే చుట్టుప్రక్కలవాళ్ళు నీకేమన్నా పిచ్చా? రామచంద్రారెడ్డి హాస్పటిల్‌కు తీసుకెళ్ళమన్నారు. సయ్యద్ బాబాగారు,

రెడ్డితాతాగారు ఆ దర్గాలను పెద్ద హాస్పటిల్ అని చెప్పడమేకాక నాకు అనుభవాలున్నందున బిడ్డను ఆటోలో దర్గాకు తీసుకుని వచ్చాము. పిల్లవాడికి ఆయన పేరు చెప్పి తీర్థం యిచ్చి 'బాబా వీడు నీ బిడ్డ వీడు చనిపోతాడని అందరికీ తెలుసు. బ్రతికించు కుంటావో, లేక చంపుకుంటావో నీ యిష్టం' అని పిల్లవాడిని దర్గా ముందర కొయ్యల మీద పడుకోబెట్టి బయటకి వచ్చేసాము. పది నిమిషాల తరువాత ఆ పిల్లవాడు నాన్నా అని పిలిచి ఆకలవుతుందని అన్నాడు. నాలుగు బోండాలు అదరా బదరాగా తిని రెండు గ్లాసులు మంచి నీళ్ళు త్రాగాడు. సాయంత్రం ఆరు గంటలకు ఇంటికి పోదామన్నాడు. ఇప్పటికీ అతనికి ఏ జబ్బు లేదు. ఆసుపత్రికి ఏ అవసరము లేదు.

నా చిన్నకుమారుడు నెల్లూరు, చిన్నబజారులో సత్యనారాయణ టెక్సటైల్స్ లో గుమస్తాగా పని చేస్తున్నాడు. వయస్సు ఇరవై నాలుగు సంవత్సరములు. 2004 సంవత్సరం తొలి ఏకాదశి రోజున స్నేహితుని స్కూటర్ మీద క్రొత్త బ్రిడ్జి మీద వెళుతుంటే యాక్సిడెంట్ అయ్యి స్కూటర్ ఇరవై అడుగులు పైకి లేచి మూడు, నాలుగు పల్టీలు కొట్టి బ్రిడ్జిమీద పడి ఇరవై అడుగులు జారింది. కానీ బండిమాత్రం వదల లేదు. నేను రెడ్డిగారి బంధువుల పుస్తకాల షాపులో నైట్ డ్యూటీ చేస్తున్నాను. పిల్లవాడికి యాక్సిడెంట్ అయ్యిందంటే నేను సయ్యద్ బాబా రక్షించు కుంటారు అన్నాను. పిల్లవాడు రామచంద్రారెడ్డి హాస్పటిల్‌కి పోయి కట్లు కట్టించుకొని నవ్వుతున్నాడు. ఎడమ చెయ్యి విరిగింది.



ప్రస్తుతం పూర్తిగా స్వాధీనంలోకి వచ్చింది. శ్రీ బాబాగారి దివ్య హస్తం లేకుంటే పిల్లవాడు బ్రతికే ప్రసక్తే లేదు.

హుస్సేన్ అనే వారు తమ దివ్యానుభవాన్ని ఇలా వివరిస్తున్నారు.

నాకు ఇదివరలో భయం భయంగా ఉండేది. అన్నం చూస్తే తినాలనిపించేది కాదు. ఏమి పెట్టిన తినేవాడిని కాదు. ఎంతసేపూ బయటకి పోయి తిరగాలనిపించేది. మనస్సుకు ఏదీ నచ్చేది కాదు. ఆ సమయంలో ఎట్టి దర్గా స్వామివారి వద్దకు పోవాలని పించి మా అమ్మగారిని వెంట తీసుకొని వెళ్ళాను. అక్కడ నలభై ఒక్క రోజు నిద్ర చేస్తే మంచిదని చెప్పారు. నాల్గవ రోజుకే బాబా కలలో కనపడ్డారు. మరలా నలభై ఒకటవ రోజు కలలో నా గుండెకు ఒక శీలకొట్టి వున్నట్లు చూపించి ఎంతో పెద్ద శీల తీసారు. తరువాత రోజు ఎడమ ప్రక్క రొమ్ము క్రింద కొంత నొప్పిగా వుంది. తరువాత కూడ కొంత కాలం పాటు అక్కడే ఉన్నాను. నొప్పి తగ్గలేదు. ఎందరికో రెండు మూడు నెలలకే నయం చేసి పంపుతున్నావే నాకెందుకు ఇంకా నయం చేయవని కోపం వచ్చి A.S పురం దగ్గర హసనాపురంలో వుండే మా గురువుగారి వద్దకు వెళ్ళిపోయాను. కానీ శ్రీ ఎట్టి దర్గా స్వామివారు నన్ను విడవక తరచూ కలలో దర్శనమివ్వడం అక్కడకు రమ్మని మరలా మరలా చెప్పుతూ వుండటం జరుగుతుండేది. చివరకు మరలా నెల్లూరు దర్గాల దగ్గరకు వెళ్ళాను. అక్కడకు వెళ్ళిన రోజే ఊపిరి ఆడలేదు. శరీరం చల్లబడి పోయినది. స్వామి నాకెవ్వరూ లేరు. మంచి చెడ్డ అంతా

మీరే దిక్కు ప్రభూ! అని ప్రార్థించుకున్నాను. అంతటితో ఆ బాధ పోయినది. మీరు నన్ను వదలినా నేను మిమ్మల్ని వదలను అన్న శ్రీ వెంకయ్య స్వామివారి మాట గుర్తుకు తెస్తుందీ అనుభవం.

భాషా అనే వారు శ్రీ స్వామివారిపై మొట్ట మొదట విశ్వాసం ఎలా కల్గిందో వివరిస్తున్నారు.

నాకు చిన్నతనం నుండి భగవంతునిపై భక్తి, మహాత్ముల సహచర్యం పై ఆశక్తి ఉండేవి. 1968లో ఒక రోజు స్వప్నంలో ఆకాశంలో చంద్రుడు గల్లుమనే శబ్దముతో తిరిగినాలోకొచ్చి నిలబడి పోయాడు. ఇది శ్రీ ఎఱ్ఱ దర్గా స్వామి వద్దకు పోయే ముందురోజు రాత్రి వచ్చిన స్వప్నము. నేను మొదటి సారిగా దర్శించు కున్నపుడు స్వామి డాక్టర్ సలాంగారి అరుగుపై మంచం మీద కూర్చొని వున్నారు. నా మనస్సులో వీరు నిజమైన మహాత్ములే అయితే వీరి కోసం తెచ్చిన బోండాలను అడిగి తీసుకొని తినాలి అని అనుకున్నాను. వెంటనే స్వామివారు 'లేకర్ ఆవో' అన్నారు. బోండాలు తింటుంటే నాకు ప్రసాదంగా పెట్టాలనుకున్నాను. అలా అనుకొంటుండగానే ఒకటి యిచ్చేశారు. అక్కడ కూజాలో నీళ్ళున్నాయి తీయమన్నారు. వారు త్రాగుతుంటే వారు త్రాగిన నీరు నాకు త్రాగించాలనుకొన్నాను. వెంటనే నీళ్ళు యిచ్చి త్రాగమన్నారు. నా మనస్సులో భావాలన్ని ఆయనకు తెలిసిపోతున్నాయి ఈయన ఊహకందని గొప్ప మహాత్ములు అని వారికి శరణాగతి చేశాను.



# శ్రీ స్వామివారి శిష్యుడు రెడ్డి తాతగారు

శ్రీ స్వామి శిష్యుడు రెడ్డి తాతగారు మొదటి పేరు సుందర రామిరెడ్డి. వారిది సూళ్ళూరు పేట. తల్లిగారిది కోడూరు. వీరి తల్లిగారు కొన్ని సమస్యలకు తట్టుకోలేక తాత ఏడెనిమిది నెలలు గర్భములో వున్నప్పుడు నీళ్ళలో దూకేసింది. ఆమెకు దూకడమే తెలుసు ఉదయం నాలుగు గంటలకు లేచి చూస్తే తడి, పొడి బట్టలతో గట్టుమీద పండబెట్టి నారు. తిరిగి ఆమెకు చావాలని పించడంలేదు. ఆమె తిరిగి ఇంటికి వెళ్ళిపోయింది. ఆమెను రక్షించినదెవరన్నది బాబాగారి వద్దకు వచ్చిన తర్వాత స్పష్టంగా తెలిసింది. బాబాగారు అన్నారట ''అమ్మ కడుపులోనుంచి కాపాడుతున్నాలేయ్యా''అని. ఎవరు ఎక్కడ తయారవుతారు అనేది కూడ మహనీయులకు తెలుసు. వాళ్ళమ్మ బావిలో దూకినప్పుడే రెడ్డితాత చనిపోవలసింది. కాని బాబాగారు మాత్రం కాపాడుతూ వచ్చారు.

రెడ్డితాత గారు బ్రహ్మచర్యంతోనే తపస్సు సాధ్యమవుతుందని వివాహం చేసుకోకుండా కాలం వెళ్ళబుచ్చుతున్నాడు. వీరిపెద్దమ్మ మంచి స్థితి పరులు. అమె మనుమరాలిని వారికివ్వాలనే ఉద్దేశ్యంతో ఒకరోజు తాతగారు రూములో నిద్ర పోయేటప్పుడు ఈమె తన మనుమరాలితో మేము హరికథకు పోతున్నాం. మేము వచ్చేలోగా వాడిని నీవాడిగా చేసుకో అని చెప్పి ఆమెను రూములోకి పంపించారు. తాతగారు ఈ అమ్మాయిని తాకితే తప్పకుండా పెళ్ళి

చేసుకోవలసి వస్తుంది. నా జన్మ వృధా అయిపోతుందనుకొని ఆమెను తాకను గూడా లేదు. అప్పుడు వారు తాతాగారిని పెళ్ళి చేసుకోమని అడగగా నాకు వద్దుగాని మా తమ్ముడికిచ్చి పెళ్ళి చెయ్యండి అన్నారు.

తాతగారు ఎప్పుడూ ఓం రామ ఓం శివా అంటూ భగవన్నామస్మరణ చేసేవారు. రాత్రి పూట పడుకొని దీర్ఘంగా ఓ పరమాత్మ నాకు సరైన గరువును ఇవ్వవయ్యా అంటూ ప్రార్థించేవారు. ఎవరైన స్వాములని చెప్పి వస్తే వారిని పరీక్షించి నకలీ స్వాములను తరిమి కొట్టేవారు. ఇలా వెతుకుతూ ఉండడంలో యాభై ఏళ్ళు గడిచిపోయినవి.

ఆ రోజుల్లో ఎవరైనా మంత్రగాడు ఊరిలోనికి వచ్చి భయపెడితే అతనిని చూసి ఊరు మొత్తం వణికి పోయేది. మంత్రగాడు బూతులు తిట్టినా గూడా ఏమీ అనేవారు కాదు. ఒకరోజు తాతగారు పొలంనుంచి వస్తూ వుంటే ఒక మంత్రగాడు సంసారుల ఇళ్ళల్లో అడుక్కొంటూ కూడా వాళ్ళను లంజా, లమిడి అంటూ తిడుతున్నారు. తాతగారు అతనిని నీవు వాళ్ళ ఇళ్ళల్లో అడుక్కోవడమేకాక వాళ్ళను బూతులు తిడుతావా అని ఎదిరించాడు. మంత్రగాడు ఏయ్ ఎవరితో మాట్లాడుతున్నావో తెలుసా అని బెదిరించగా ఎవరితోరా అంటూ నాలుగు దెబ్బలు తగిలించి బావిలో పడేసి ఇప్పుడు నీ నెత్తిమీద రాయి వేసి చంపుతాననెను. మంత్రగాడు కుయ్యో మొర్రో అని కాళ్ళ వేళ్ళ



పడి క్షమించమని అడిగెను. తాతగారు అతనిని బావిలోనుంచి బయటకు లాగి ఈ చుట్టు ప్రక్కల ఊళ్ళల్లో కనబడ్డావంటే ఇక బ్రతకవు అని బెదిరించి పంపి వేసెను. తాతగారు అంత ధైర్యశాలి.

రెండవ ప్రపంచ యుద్ధకాలములో మిలిటరీ వారు వచ్చి సముద్రము దగ్గర రక్షణ గుడారాలు ఏర్పరచారు. ఊరిలోని స్త్రీలు నీళ్ళకు పోతుంటే బలవంతంగా ఎత్తుకొనిపోయి వారి మానాల్ని దోచుకోవడం జరిగెను. అప్పుడు తాతగారు, అతని స్నేహితుడు తాటి దబ్బలు చీల్చుకొని మిలిటరీ వాళ్ళను వాయించేశారు. ఇతని స్నేహితుడు భయపడి పారిపోయాడు. మిలిటరీ వాళ్ళలో ఒకడు తుపాకి పడేసి అడ్డదారి గుండా నెల్లూరుకి చేరి ఈ విషయం పోలీసులకు తెలిపినాడు. తాతగారు వాళ్ళకు సంబంధించిన పుస్తకాలు, తుపాకీలు, లైసెన్సులు దాచి పెట్టినారు. పెద్ద ఆఫీసర్లు వచ్చి ఊరిలోని వారందరిని విచారించినారు. ఎవ్వరూ తాతగారి గురించి చెప్పలేదు. ఎవరూ చెప్పకపోయేసరికే వచ్చినటువంటి పై అధికారి మిలిటరీ వారిని దండించినది ఎవరో అతనిని మా ముందుకు రమ్మనండి అతనిని మేము ఏమీ అనము. అతని వాదన కూడా వింటాము అన్నారు. తాతగారు మిద్దె మీదనుండి ఈ మాటలన్నీ వింటున్నారు. వెంటనే తుపాకీ తీసుక వచ్చి వారి ముందు పడేసి నిలబడినారు. అక్కడే వున్న గుర్ఖా తుపాకితో నిన్ను కాల్చేస్తాను అన్నాడట. తాతగారు చొక్కాతీసి కాల్చవోయ్ మేమేమన్నా శత్రు సైనికులమా? లేక టెర్రరిష్టులమా? మీరు ఎంత ఘోరమైన తప్పు చేశారన్నది విచారించ కుండా ఏంది నీవు

కాల్చేది కాల్చు చూద్దాం అంటూ నిలబడ్డారు. తాతగారి రౌద్ర రూపం, ధైర్యంగా మాట్లాడటం చూచి పై అధికారి నా దేశంలో ఇంత ధైర్యశాలి ఉన్నాడా? అని సత్కరించెను. మిలిటరీ వాళ్ళు చేస్తున్నటువంటి అరాచకాలను తాతగారి ద్వారా పై అధికారి తెలుసుకొని వాళ్ళను మీరు ఇటువంటి పనులు తిరిగి చేస్తే మిమ్మల్ని యుద్ధ నేరస్తుల క్రింద కాల్చేయవలసి వస్తుందని చెప్పి వారి జీవితంలో కొన్ని రిమార్కులు రాసి వారిని ఆ గడ్డ మీద నుంచి దూరంగా పంపి వేశారు.

ఒకసారి తాతగారి మీదకు అతని శత్రు వర్గం డెబ్బై మంది వస్తున్నారు. ఇది తెలుసిన ఒకతను తాతగారికి ఈ విషయం చెప్పాడు. తాతగారికి కర్రసాము, కరాటీ వచ్చు. ఆ చీకటిలో కర్రతీసుకొని అందరిని చితక బాధాడు. చాలా మందికి భయంకరమైన దెబ్బలు తగిలాయి. మమ్మల్ని కొట్టినాడు అని వాళ్ళు కోర్టుకి వెళ్ళినారు. తాతగారు మాత్రం మామూలు పిచ్చోడిలాగా కోర్టుకి వచ్చి జడ్జి గారితో నేను డెబ్బై మందిని కొట్టగలనా? వారికి వారే త్రాగి కొట్టుకొని నా మీద చెప్పుతున్నారయ్యా అని చెప్పెను. జడ్డిగారు ఇది త్రాగి కొట్టుకున్న కేసు అని కొట్టి వేసెను.

రేయింబవళ్ళు కష్టం చేసి ఒరుగొండలో 3 ఎకరాలు సంపాదించాడు. ఇది చాలా విలువ గలిగిన పొలము. ఈ మూడు ఎకరాలు అమ్మివేసి 14 ఎకరాలు కొనాలని ఒక ఆసామికి డబ్బులు ఇస్తే తీసుకొని మోసం చేశాడు. తాతగారు అతనిపై రౌద్ర రూపం దాల్చి నా 14 ఎకరాలు ఇస్తావా లేదా చస్తావా అని కత్తితో



బెదిరించినాడు. అప్పుడతడు భయపడి రిజిష్టర్ చేశాడు. 14 ఎకరాలలో వ్యవసాయం చేసేవారు. తమ్ముడికి పేదవారి అమ్మాయినిచ్చి పెళ్ళి చేశాడు. అతని భార్య మనము వేరు పోదాము అని బలవంతం చేయసాగింది. అప్పుడు తాతగారు ఏరా నీకు ఏమి కావాలి అనగా నీ యిష్టం అని తమ్ముడు అనగా సగం ఆస్థి పంచేసి ఏ వస్తువైనా తీసుకపోరా లేక పోతే అంతా నీవే తీసుకోనిపో కాకపోతే కాస్త చెల్లిని, అక్కను మనమే చూచుకోవాలి అని చెప్పగా తమ్ముడు నా వల్లగాదు నా భార్య అంగీ కరించడంలేదు అని చెప్పి వేరు వెళ్ళి పోయినాడు. ఇప్పుడు వీరు ఈదూరులో స్థిరనివాసం ఏర్పరచుకున్నారు. తాతగారి చెల్లెలు ఎవరూ వారిని దర్శించరు. ఎందుకనగా తాతగారు తురఖవారిలో చేరిపోయినాడని భావించెడి వారు.

తాతగారు వివాహం గూడా చేసుకోకుండా ఊరిలోనే జనాల కోసం పోరాడుతూ ఎన్నో ఎదురు దెబ్బలు తినేవారు. నడిచినా, కూర్చున్నా, పోయేటప్పుడు లేచేటప్పుడు నిరంతరం భగవన్నామ స్మరణ చేసేవారు. మామూలు పేదవారికి అన్నం దొరకని రోజులలో ఆ గ్రామములోకి వచ్చిన స్వాములకు జీడి పప్పుతో భోజనాలు తీసుకపోయి యిచ్చేవారు.

ఒకసారి శ్రీ రెడ్డితాత గారిని అసలు ఇచ్చటకు ఎలా వచ్చారండి అని షఫీ గారు అడుగగా వారు ఇలా చెప్పారు. రెడ్డిగారికి చిన్నతనంనుండి భగవంతుని కోసం తపన వుండేది. వారు ఎంతో పౌరుషం కలవారు. భగవంతునికి అంకితం కావాలని పెండ్లి కూడా చేసుకోలేదు. గురువు కోసం తిరుపతికి, కసుమూరుకు వెళుతుండేవారు. మూడుసార్లు అన్నం లేకుండా ఉపవాసంతో

దిగువ తిరుపతి నుంచి తిరుమలకు నడుచుకొని పోయారు. ఒకసారి కసుమూరు మస్తానయ్యగారి దగ్గర నాకు దేముడు కావాలని కూర్చున్నాడు. ఇతను మాత్రం టైం పెట్టుకొని "అయ్యా నీవు మహాత్ముడవో కాదో నాకు తెలియదు నీకు 15 నిమిషాలు టైం ఇస్తున్నాను. ఈ లోపల నీవుగాని నీ ఏజంటుగాని చెప్పారా సరేసరి లేక పోతే నేను చెయ్యరాని తప్పులు చేసి తిట్టరాని తిట్లు తిట్టి చనిపోతాను. దేవుడు నాకు కనబడనప్పుడు ఈ జీవితం ఎందుకు? నేను చివరిసారిగా ఇక్కడకు వచ్చాను అని అలాగే నిలబడి వున్నాడు. 10 నిమిషాలు గడిచిపోయింది. అయ్యా! ఇంక 5 నిమిషాలే ఉండేది చెప్తావా లేదా అని గద్దించారు. కసుమూరు మస్తాన్ స్వామి దయాపరుడు అంటూ ఎవరో వచ్చి వెనుక తగిలారు. అరవం స్వామి అనుకొని ఈ విషయం పూర్తిగా మరచి పోయాడు. రాత్రంతా అతని దగ్గరే వున్నాడు. తాతగారిని దూరంగా జండాలు వున్న వేరే దర్గాల దగ్గరకు తీసుకొని పోయాడు. అప్పుడు సమయం రాత్రి 2 గంటలు. అక్కడ ఒక దయ్యం భయంకరంగా ఎగురుతున్నది. అప్పుడు ఈ స్వామి దానిని చూచి గాలిలో చిటిక వేశారు. అంతే అది కట్టేసినట్లు ఆరు అడుగుల ఎత్తు నుండి బోర్లా పడింది మనకైతే కాలు ముక్కలు ముక్కలుగా అయి వుండేది. మహనీయులు దయ వుండబట్టి దానికేమీ కాలేదు. అది అతి భయంకరంగా కేకలు పెడుతూ బాబా నేను ఇంకేం చేయను. నన్ను వదిలేయ్ అంటూ మధ్యలో రేయ్ నీవు ఎంతరా అని అంటూ అక్కడ పొర్లాడుతూ వుంది. ఈ ముసలాడు ఎవరో కాని ఇతనిలో చాలా మంచి శక్తి వుంది అనుకొన్నాడు. తాత గారికి భయంకరంగా ఆకలి వేస్తున్నది. అప్పుడు ఆ స్వామివారు తన సంచిలో చెయ్యి పెట్టి గుప్పెడు వేడి బిర్యానీ తాతగారి చేతిలో



వేసినారు. ఈ ముసలాడు తినటానికి వేడి వేడి బిర్యాని పెట్టుకొని వున్నాడే అని తాతగారు అనుకున్నారు. నీళ్ళు అనుకునేసరికే టిపిన్‌తో నీళ్ళు ఇచ్చారు. ఇతను తాతగారిని ఓయ్ ఉదయం ఎక్కడికైనా పోతావేమో నేను వస్తాను అని చెప్పి శెనగలు బెల్లం కొనుక్కొని వచ్చాడు. అవి తాతగారికి ఇచ్చి పసి పిల్లలకు తినిపించినట్లు ఖావ్ (తిను) అని చెప్పి ఇచ్చినారు. అప్పుడు తాతగారికి ఒంటేలికి పోవాలనిపించింది. తాతగారు వెళ్ళి వచ్చేసరికే ఇతను కనిపించకుండా పోవడం జరిగింది. తాతగారు ఈ ముసలాడు ఎలా పోయినాడు అని ఆలోచించుకుంటూ వరిగొండలోని తన రూములోనికిపోయి తలుపేసుకొని కాఫీ మాత్రమే పంపించండి అని చెప్పి అలానే కూర్చున్నాడు. అలా ఎనిమిది రోజులు అన్నం తినకుండా ఉదయం సాయంత్రం కాఫీ మాత్రమే త్రాగుతూ ఓ కసుమూరు మస్తానయ్య స్వామి నీవే వచ్చి నాకు తారక మంత్రం బోధిస్తే నేను లేచి బయటకు వస్తాను లేకుంటే నేను భోజనం చేయకుండా ఇలానే చనిపోతాను అన్నాడు. 8వ రోజు స్వామి మంచం క్రింద కూర్చొని తాతగారి చేత 3సార్లు తారక మంత్రం పలికించారు. ఇద్దరూ నడుచు కొంటూ నెల్లూరుకి వచ్చినారు. "తాత ఎనిమిది రోజులు కూడు లేకుండా ఎలా నడిచావు అని షఫీ గారు అడగ్గా ఏందిరా మహనీయులు వస్తే మన లోపాలు వుంటాయంట్రా అక్కడి కక్కడే కరెక్టయి పోతాయిరా" అని అన్నారు. ఒక వేళ మహనీయులు రాకపోతే ఎలా అంటే చచ్చి పోతానురా! దేవుడు లేనప్పుడు బ్రతకటం ఎందుకురా అన్నారు. అప్పుడు సంవత్సరం రోజులు బాబాగారి చుట్టు తిరిగినారు. నేను వస్తానంటే తీసుకోవటం లేదేమి అని అడుగ్గా అప్పుడు నాయనగారు పెద్ద వాళ్ళ ఆర్డరు కావాలయ్యా అన్నారట.

తాతగారిని మూడు రోజులుపాటు వారిదగ్గరకు రానీయలేదు. తనకున్న ఆస్థినంతా పంచేసి వచ్చారు. కానీ వుండ నివ్వలేదు ఈయన నేనిక్కడే చనిపోతానని మొండికేసుకొని కూర్చున్నారు. ఆ తరువాత సరేనని దగ్గర కూర్చోపెట్టుకున్నారు. ఎన్నో పరీక్షలు పెట్టేవారు. అన్నం భిక్ష అడిగి తెస్తే ఒక్కముద్ద మాత్రం తిని మిగిలినది విసిరి కొట్టేవారు. ఒక్కోసారి అన్నమంతా తీసుకవెళ్ళి ఇతర జీవులకు ఊడ్చి పెట్టేసేవారు. రెడ్డితాతను మాత్రం పూర్తిగా పస్తు వుంచేవారు. ఇలా నలభై రోజులు పస్తు వుంచినారు. నలభై ఒకటవ రోజు మాత్రం ఓర్చుకోలేక బజారులో బటానీలు తినివచ్చారు. ఈ విషయం వీరు చెప్పకున్నా స్వామివారు ''నీవు నలభై రోజుల్లో చేసినదంతా వృధా అయిపోయింది పో ఇక్కడ నుండి అన్నారు. ''దీనంగా కన్నీళ్ళతో క్షమార్పణ వేడుకొంటే మళ్ళా మనిషిని చేశాడు.

ఎట్టి దర్గాస్వామివారు ఖండయోగం చేయటం కూడ అమీర్ జాన్ భాయి అనే భక్తుడు చూశాడు. యిది చూచిన తరువాత తన ముప్పై సంవత్సరముల జీవితం స్వామి సేవకు అంకితం చేశాడు. ఇంతటి మహాత్ములు సమాధి అనంతరం కూడా వారి సమాధి వద్ద ఎందరికో ఎన్నో అనుభవాలను ప్రసాదించడం ముముక్షువులకు మార్గం చూపడం అనుభవైక వేద్యము.

## షఫీ గారు సయ్యద్ అహమద్ బాబాగారి దగ్గరకు రావడం.

మాది (షఫీ) నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం సర్వేపల్లి గ్రామం. నెల్లూరు వచ్చి కూలి నాలి చేసుకొని బారకాసులో ఒక మసీదులో పడుకొనేవాడిని. చిన్న నాటినుండి



నమాజు చేయడం నాకు అలవాటు. బారకాసులో ఇంత మంది మహనీయులు సమాధులున్నాయి గదా ఒక్క మహనీయుని కూడా చూడలేక పోయాననుకొనేవాడిని. నా స్నేహితుడు ఒకతను ''ఇక్కడ సయ్యద్ అహమద్ బాబా అనే ఒక మహనీయుడున్నాడు రాత్రి వేళ వారు నడుస్తుంటే వెలుగు కనపడుతుంది. తల, కాళ్ళు చేతులు, మొండెము విడి విడిగా పడివుంటే చూచాను. కొన్ని నిమిషాలు తర్వాత వారు శుభ్రంగా కూర్చొని కనిపించారు అని చెప్పి వారిని దర్శించమన్నారు. అక్కడ చిమ్మే ఒకతను నన్ను ఉదయం నాలుగు గంటలకు నమాజుకు లేపేవాడు. కొన్ని కారణములు వలన రెండు రోజులు అతను నిద్ర లేపలేదు. నిత్యము సయ్యద్ అహమద్ గారు నాకు ఎదురు వచ్చి ఎంతో ప్రేమతో తానే సలాం చెప్పేవారు. ఈ రెండు రోజులు నమాజు చేయని కారణంగా వారు ఎదురుపడి ఎంతో కోపంతో చుర చుర చూస్తూ తప్పుకొని వెళ్ళిపోయారు. నేను నమాజు చేయలేదన్న విషయం వారికి తెలిసిపోయింది. ఈ అనుభవం తర్వాత వీరు మహనీయులే అని స్థిరమైంది. అది మొదలుకొని ప్రతి రోజు వారి దగ్గర కూర్చొ సాగాను. బాబాగారి మాట సృష్టి మాటలాగా వుంది. వారి నోటి నుండి వచ్చిన ప్రతి మాట జరిగిపోతుంది. వారితో స్నేహం చేయడం మొదలు పెట్టాను. అప్పుడు నా వయస్సు ఇరవై మూడు సంవత్సరములు. క్రమంగా అహమద్ బాబాగారి శిష్యులైన రెడ్డితాతతో పరిచయం మొదలైనది.

షఫీ గారు కసుమూరు అవతల ఉండే గ్రామాలకు అనేక సార్లు పని మీద వెళ్ళి వచ్చేవారు. కానీ కసుమూరు మస్తానయ్య దర్గాను దర్శించి నమస్కరించు కొనేవాడు కాదు.

ఒకనాటి కలలో కసుమూరు మస్తానయ్య కనిపించి ఈ దోవన పోయి వస్తుంటావు గదా మరి ఇక్కడ నమస్కారం చేయాలని తెలియదా? అని అడుగుతారు. దీనిని బట్టి మానవులందరమూ మహనీయుల ఎడల గల శ్రద్ధా భక్తులను, వారి సమాధులను దర్శించి నమస్కరించు కోవడమెంత ముఖ్యమో తెలుస్తున్నది.

ఒకనాడు షఫీగారు గుండెనొప్పితో స్పృహ లేకుండా పడి ఉన్నారు. వీరి భార్యకొక స్వప్నంలాంటి దృశ్యం గోచరిస్తుంది. షఫీగారి ప్రక్కన గుంటూరు నల్ల మస్తాన్ ఔలియా, నెల్లూరు యర్ర దర్గస్వామి మరియు కసుమూరు మస్తానయ్య గార్లు నిలబడి ఉన్నారు. టైం అయిపోయింది తీసెయ్యండి అని కసుమూరు మస్తానయ్య అంటున్నారు. గుంటూరు నల్లమస్తాన్ ఔలియా మరియు నెల్లూరు ఎర్రదర్గాస్వామిగారు "దయచేసి ఒక్కఛాన్సు ఇవ్వండి స్వామి అని బ్రతిమాలుచున్నారు". కస్మూరు స్వామి: "ఎందుకు? ఎన్నిమార్లు చెప్పినా కొంచెమైనా ప్రయోజనం లేకపోయింది. వద్దు తీసెయ్" అని కోపంగా అంటున్నారు. నల్లమస్తాన్ ఔలియా, ఎర్ర దర్గా స్వామి బ్రతిమాలుతూనే వున్నారు. చివరకు షఫీగారు లేచి ఆరోగ్యవంతుడయ్యాడు.

దీనిని బట్టి మహనీయుల సలహాలను మనము ఆచరించకుంటే వారు మనలను గురించి పట్టించుకోరు. అందుకే భగవాన్ శ్రీ వెంకయ్య స్వామివారు ''పొయ్యేవాళ్ళను పోనిచ్చేదే గదయ్యా'' అన్నారు. మనం వారి ఆజ్ఞలను పాటించక పోయినా ఆచరించేందుకు హృదయపూర్వకమైన ప్రయత్నమైనా చేయాలి. కన్నీటితో వారికి మొరపెట్టుకోవాలి.



యర్ర దర్గా స్వామివారు తే 21.01.1977 న మహా సమాధి చెందారు. వీరి సమాధి నెల్లూరు D.K.W కాలేజి ప్రక్కన గల ఎర్ర దర్గాలో వున్నది. ఎందరికో బాధలు తీరుస్తూ అందరికి కలియుగ దైవమైయున్నారు. వీరి సమాధి వద్ద రొట్టెలు పండుగ జరుపుతారు. భారతదేశమందలి అన్ని ప్రాంతాలనుండి భక్తులు వచ్చి ఆనాడు బాబాగారికి నివాళులర్పిస్తారు.

# మా ఇతర ప్రచురణలు

| | | |
|---|---|---|
| 1. | వార్తా లాపము | 150 రూ\|\| |
| 2. | అవధూత లీల - అరవం | 50 రూ\|\| |
| 3. | శ్రీ వెంకయ్య స్వామి - అరవం, చిన్న పుస్తకం | 5 రూ\|\| |
| 4. | అవధూత లీల - శ్రీ వెంకయ్య స్వామి వారి చరిత్ర నిత్య పారాయణ గ్రంధము, తెలుగు | 40 రూ\|\| |
| 5. | అవధూత లీల - ఇంగ్లీషు | 30 రూ\|\| |
| 6. | శ్రీ వెంకయ్య స్వామి - ఇంగ్లీషు, చిన్న పుస్తకం | 5 రూ\|\| |
| 7. | శ్రీ ధునీవాలా దాదా చరిత్ర | 15 రూ\|\| |
| 8. | అవధూత బోధామృతము - శ్రీ స్వామి వారి బోధలు | 15 రూ\|\| |
| 9. | శ్రీ స్వామి సన్నిధి - శ్రీ స్వామివారి సేవకుల అనుభవాలు | 15 రూ\|\| |
| 10. | శ్రీ శివనేశన్ స్వామీజీ దివ్య చరితము | 12 రూ\|\| |
| 11. | శ్రీ బూర్లె రంగన్న బాబుగారి దివ్య చరిత్ర | 8 రూ\|\| |
| 12. | గురుస్తుతి | 7 రూ\|\| |
| 13. | మంత్రమెక్కడుంది! తంత్రమెక్కడుంది! శ్రీ మాధవదాసు గారి దివ్య చరిత్ర | 4 రూ\|\| |
| 14. | శ్రీ పూండి స్వామి వారి దివ్య చరిత్ర | 2 రూ\|\| |
| 15. | మౌన బోధ | 1 రూ\|\| |
| 16. | పిలచిన పలికే దైవం | 1 రూ\|\| |
| 17. | ధర్మమూర్తి | 1 రూ\|\| |
| 18. | బోధ యజ్ఞాయ నమ: | 1 రూ\|\| |
| 19. | దివ్య లీలలు | 1 రూ\|\| |
| 20. | శ్రీ వెంకయ్య స్వామి వారి పూజ | 1 రూ\|\| |
| 21. | శ్రీ స్వామి కృప | 1 రూ\|\| |
| 22. | శ్రీ స్వామి వారి భజన పాటలు | 1 రూ\|\| |
| 23. | నమ్మలేని పచ్చిసత్యాలు | 1 రూ\|\| |
| 24. | వెన్నెల పూలు - శ్రీ వెంకయ్య స్వామి దివ్యత్వం | 1 రూ\|\| |
| 25. | శ్రీ కృష్ణయ్య స్వామి దివ్య చరిత్ర, ప్రొద్దుటూరు | |
| 26. | నెల్లూరు శ్రీ యర్ర దర్గా స్వామివారి దివ్య చరిత్ర (శ్రీ సయ్యద్ అహ్మద్ బాబా గారి దివ్య చరిత్ర) | |
| 27. | ఆచార్య భరద్వాజ గారి సత్‌సంగము | ఉచితము |
| 28. | శ్రీ మాష్టారి మంచిమాట - శ్రీ E.భరద్వాజ గారి దివ్యవాణి | ఉచితము |
| 29. | శ్రీ భరద్వాజ గారితో భక్తుల అనుభవాలు | ఉచితము |
| 30. | శ్రీ జ్ఞానేశ్వర్ మహరాజ్ చరిత్ర | ఉచితము |
| 31. | మృత్యువు పై ఘనవిజయము | ఉచితము |
| 32. | మన ధర్మము - కర్తవ్యము | ఉచితము |
| 33. | శ్రీశ్రీశ్రీ సుధీంద్ర బాబు గారు | ఉచితము |
| 34. | స్మృతిమాత్ర ప్రసన్నాయ నమ: | ఉచితము |
| 35. | స్మృతిరహిత ప్రసన్నాయ నమ: | ఉచితము |
| 36. | శుద్ధ చైతన్యమే తానైన పూజ్య శ్రీ భరద్వాజ మాష్టార్ గారు | ఉచితము |
| 37. | అమృత వాక్కులు | ఉచితము |
| 38. | సర్వ సమర్థుడు | ఉచితము |
| 39. | భగవాన్ శ్రీ వెంకయ్య స్వామి(హింది) | ఉచితము |
| 40. | జ్ఞానేశ్వరి భగవద్గీత | 210 రూ\|\| |

Please visit www.saimastersevatrust.org